నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ
ఆదివారం | జనవరి 21, 2024 | www.navatelangana.com

పదవ వార్డులో హెల్త్ క్యాంపు



నవతెలంగాణ-చిట్యాలటౌన్

పట్టణంలోని పదవ వార్డులో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు శనివారం ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు మహమ్మద్ ఆజాద్, శివాని లు వైద్యులను పరీక్షించి మందులను అందజేశారు. ఈ శిబిరానికి ముఖ్యఅతిథిగా ఆ వార్డు కౌన్సిలర్ సిలివేరు మౌనిక శేఖర్ హాజరై పర్యవేక్షించారు. సిహెచ్ఓ శ్రీనివాస్ ఏఎన్ఎం సరళ, ఇతర సిబ్బంది రమేష్, గీత, కవిత, జయమ్మ, రజిత, సునీత పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

నవతెలంగాణ-చిట్యాలటౌన్



గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన చిట్యాల మండల పరిధిలోని జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన జరిగింది. చిట్యాల ఎస్ఐ రవి తెలిపిన వివరాల ప్రకారం... పెద్ద కాపర్తి గ్రామ పరిధిలోని జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో రామన్నపేట మండలం తుమ్మల గూడెం గ్రామానికి చెందిన రాధారపు మల్లేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేటకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్టు తెలిపారు.

ప్రశ్నార్థకంగా...



- 12 రోజుల్లో ముగియనున్న సర్పంచ్‌ల పదవీ కాలం
- ఎన్నికలపై ఎలాంటి ప్రకటన చేయని ప్రభుత్వం
- ప్రత్యేక అధికారులా..! పర్సన్ ఇన్‌చార్జిలా..?
- పార్లమెంటు ఎన్నికలపై 'స్థానిక' ప్రభావం
- సకాలంలో నిర్వహించకపోవడంతో 'ప్రత్యేక' పాలన

పంచాయతీ సమరం..!

రాష్ట్రంలో 'పంచాయతీ' సమరం.. ప్రశ్నార్థకంలో పడింది. ప్రస్తుత సర్పంచ్‌ల పదవీకాలం మరో 12 రోజుల్లో ముగియనుంది. కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం 'పంచాయతీ' సమరంపై ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో ఇప్పట్లో ఎన్నికలను నిర్వహించే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని స్పష్టమవుతోంది. మూడు నెలల్లో జరిగే పార్లమెంటు ఎన్నికలపై స్థానిక ఎన్నికల ప్రభావం చూపే అవకాశాలున్నాయని, ఈ నేపథ్యంలో ఎన్నికలను వాయిదా వేయడమే మంచిదని కొత్త ప్రభుత్వం నిర్ణయించుకున్నట్లు తెలుస్తున్నది. పంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం 12 రోజుల్లో ముగుస్తుండడంతో పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన, లేకుంటే పర్సన్ ఇన్‌చార్జీలుగా సర్పంచ్‌లను నియమించాల్సి ఉంటుంది.

నవతెలంగాణ-నల్లగొండటౌన్

ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా 1,740 గ్రామపంచాయతీలున్నాయి. నల్లగొండ జిల్లాలో 844 గ్రామపంచాయతీలు, సూర్యాపేట జిల్లా లో 475, యాదాద్రి భువనగిరి జిల్లాలో 421 గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. అయితే ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలు వాయిదా వేస్తే జూన్‌లో ఎన్నికలు నిర్వహించే అవకాశాలున్నాయి. 2018 పంచాయతీరాజ్ చట్టం ప్రకారం రిజర్వేషన్లు రెండు పర్యాయాల వరకు అప్పటి రిజర్వేషన్లు ఉంచినట్లయితే జూన్‌లో ఎన్నికలు సాధ్యమవుతాయి. ప్రభుత్వం రిజర్వేషన్లు ఒక పర్యాయానికే పరిమితం చేయాలని భావించినట్లయితే చట్ట సవరణ చేయా ల్సి ఉంటుంది. దీనికి శాసనసభ సమావేశాలు ఏర్పా టు చేసి చట్ట సవరణ చేయాల్సి ఉంది. ఇంకా ఇదే సంవత్సరంలో ఎంపీటీసీలు, జడ్పీటీసీల ఎన్నికలు కూడా రానున్నాయి. ఈ ఏడాది మొత్తం ఎన్నికలు నిర్వహించనున్నారు. గతంలో గ్రామపంచాయతీ ఎన్నికలు మూడు ధఫాలుగా నిర్వహించారు. ఈసారి కూడా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూడు దఫాలల్లో ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయి.

గత బీసీ రిజర్వేషన్ల వివరాలు....

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పలు వివరాలను సేకరించినట్లు సమాచారం. దీంతో రాష్ట్రస్థాయి అధికారులు 2006, 2013, 2018 సంవత్సరాల్లో గ్రామపంచాయతీల్లో అమలు చేసిన బీసీ రిజర్వేషన్ల వివరాలను తీసుకున్నారు. అప్పట్లో గ్రామపంచాయతీల్లో వార్డులు, సర్పంచ్‌లకు అమలైన బీసీ రిజర్వేషన్లను తీసుకున్నారు. ప్రస్తుతం ఎన్నికల నిర్వహణ లేకపోవడంతో పూర్తిస్థాయిలో కొత్తగా రిజర్వేషన్లు అమలుచేసి ఎన్నికలు నిర్వహిస్తారా? లేదా? పాత రిజర్వేషన్ ప్రకారం ఎన్నికలు ఉంటాయా? అనేది మరికొన్ని రోజుల్లో తేలనుంది. గ్రామీణ ప్రాంతాల్లో వివిధ పార్టీలకు చెందిన రాజకీయ పార్టీలు డైలమాలో ఉన్నారు. సర్పంచ్ పదవులకు పోటీ చేయడానికి ఆసక్తి ఉన్న నాయకులు కొత్త ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో తెలియకపోవడంతోపాటు రిజర్వేషన్లు పాతవే కొనసాగిస్తారా?, కొత్త రిజర్వేషన్లు చేసి ఎన్నికలు నిర్వహిస్తారని తేలకపోవడంతో నేతలు అయోమయంలో పడ్డారు.

ఎన్ని'కలే'నా.....

పంచాయతీ ఎన్నికలపై ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో సర్పంచ్‌గా పోటీ చేస్తామని కలలు కన్న అభ్యర్థుల ఆశలు ఎన్ని'కల'గా నే మిగిలిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారం చేపట్టినందున పంచాయతీ ఎన్నికలు సకాలంలో జరిగితే అలవోకగా సర్పంచ్‌లుగా ఎన్నికవొ చ్చని కలలుగన్న అధికార పార్టీకి చెందిన నాయకుల ఆశలు.. అడియాశలు గానే ఉండిపోయాయి. మరో మూడు నెలల్లో పార్లమెంటు ఎన్నికలు ఉన్నందున.. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒక అభ్యర్థిని బల పరిస్తే మరో అభ్యర్థి పార్టీకి దూరమయ్యే అవకాశానికి తావి స్తే ఆ ప్రభావం పార్లమెంటు ఎన్నికల ఫలితాలపై పడే అవకాశముందని భావించిన కాంగ్రెస్ పార్టీ ఆది ష్టానం పార్లమెంటు ఎన్నికలు ముగిశాకనే పంచాయ తీ ఎన్నికలను నిర్వహించడానికి మొగ్గు చూపుతుంది.

ప్రత్యేక అధికారులా.. పర్సన్ ఇన్‌చార్జిలా..?

పంచాయతీ ఎన్నికలు సకాలంలో జరిగే అవకాశం లేనందున ఫిబ్రవరి 2 నుంచి పంచాయతీల పాలన ప్రత్యేక అధికారుల చేతికా.. పర్సన్ ఇన్‌చార్జీల చేతికి వెళ్తుందా అనేది ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. జీవో నంబర్ 113 ప్రకారం గ్రామ పంచాయ తీలకు సకాలంలో ఎన్నికలు నిర్వహించకుంటే ప్రత్యేక అధికా రులను గాని, లేదా ప్రస్తుతం ఉన్న సర్పంచ్‌లనే పర్స న్ ఇన్‌చార్జీలుగా నియమించే అధికారం రాష్ట్ర ప్రభు త్వానికి ఉంది. ప్రత్యేక అధికారులను నియమిస్తేనే పంచాయతీల్లో పాలన సాఫీగా సాగే అవకాశ ముంద ని పలువురు అభిప్రాయపడుతున్నారు. జిల్లాలో మెజార్టీ గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్‌కు చెందిన వారే ఉన్నారు. ఈ నేపథ్యంలో సర్పంచ్‌లను పర్సన్ ఇన్‌చార్జీలు గా నియమించేందుకు రాష్ట్రంలో కొత్తగా అధికా రం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం సుముఖత చూపకపోవచ్చన్న అనుమానాలు వ్యక్తమ వుతున్నాయి. దీంతో పంచాయతీ ఎన్నికలు జరిగేవరకు ప్రత్యేక అధికారు లను నియమించే అవకాశాలే మెండుగా ఉన్నాయని రాజకీ య పరిశీలకులు అభిప్రాయ పడుతున్నారు. గతంలో 2005లో సర్పంచ్‌ల పదవీకాలం పూర్తయిన వెంటనే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 14 నెలల పాటు సర్పంచ్‌లనే పర్సన్ ఇన్‌చార్జీలుగా నియమించింది. తదనం తరం 2011లో సర్పంచ్‌ల పదవీకాలం ముగియ గానే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 2011 నుంచి 2013 వరకు ప్రత్యేక అధికారులను నియమించింది.

ప్రత్యేక అధికారుల పాలనకు కసరత్తు..!

పాలకవర్గాల పదవీకా లం 12 రోజుల్లో ముగియనున్నందున.. ప్రతీ గ్రామపంచాయతీకి ప్రత్యేక అధికారి ని నియమిం చేందుకు ఉన్నతా ధికారుల ఆదేశాల మేర కు ఇప్పటినుంచే పంచా యతీ రాజ్‌శాఖ అధికా రులు కసరత్తు ప్రారం భించారు. ప్రత్యేక అధికా రులుగా ఎంపీడీవోతో పాటు తహసీల్దార్, ఎంపీవో, ఆర్ఐలు, సర్వేయర్లు, ఎంఈవోలు, ఈజీఎస్, ఐకేపీ సిబ్బం దిని ఎంపిక చేసే కార్యక్రమంలో పంచా యతీరాజ్‌శాఖ అధికారులు ఉన్నట్టు సమాచారం.



పట్టా బద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

- ఫిబ్రవరి 6 వరకు దరఖాస్తుల స్వీకరణ, 24న ముసాయిదా ఓటర్ జాబితా
- ఏప్రిల్ 4న తుది జాబితా

కలెక్టర్ హరిచందన దాసరి

నవతెలంగాణ-నల్లగొండకలెక్టరేట్

వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్ట భద్రుల నియోజకవర్గంకు జరిగే ఉప ఎన్నికలో అర్హులైన పట్ట భద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి విజ్ఞప్తి చేశారు. శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వరంగల్, ఖమ్మం,నల్లగొండ పట్ట భద్రుల నియోజక వర్గం కు సంబందించి ఓటర్ జాబితా తాజాగా రూపొందించడం జరుగుతుందని తెలిపారు. గత ఎన్నికలలో ఓటర్ గా నమోదైన వారు కూడా కొత్త గా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 1 నవంబర్ 2023 కంటే (3) సంవత్సరాలకు ముందు అంటే 1 నవంబర్ 2020 నాటికి డిగ్రీ ఉత్తీర్ణత చెందినవారు ఓటర్ గా నమోదు చేసుకోవాలని ఎ కోరారు. లోకల్ ప్రాంతంలో నివాసితులై ఉండాలన్నారు. పట్టభద్రుల నియోజకవర్గంకు సంబందించి దరఖాస్తులను ఆర్డీవో ఆఫీస్, తహశిల్దార్ కార్యాలయం లలో స్వయంగా గాని లేదా ceotelangana.nic.in అనే వెబ్సైట్లో ఆన్లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ దరఖాస్తులను ఫిబ్రవరి 6వ తేదీ వరకు స్వీకరించనున్నట్లు, ఫిబ్రవరి 24వ తేదీ నాడు ముసాయిదా ఓటర్ జాబితా ప్రచురించ నున్నట్లు తెలిపారు. అదేవిధంగా ముసాయిదా జాబితా పై అభ్యంతరాలు ఉన్నట్లయితే ఫిబ్రవరి 24వ తేదీ నుండి మార్చి 14వ తేదీ వరకు స్వీకరించ నున్నట్లు. మార్చి 29 వరకు పరిశీలించి, ఏప్రిల్ 4వ తేదీన తుది జాబితా ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 12832 దరకాస్తులు వచ్చినట్లు ఆమె వివరించారు. మొత్తం గ్రాడ్యుయేట్ నియోజకవర్గం అన్ని జిల్లాలు కలిపి 77579దరకాస్తు లు వచ్చినట్లు తెలిపారు. ప్రత్యేక ఓటర్ జాబితా ఓటర్ సవరణ 2024 లో భాగంగా పార్లమెంట్ కు జరుగనున్న సాధారణ ఎన్నికలలో ఓటరుగా నమోదు చేసుకునేందుకు 18 ఏండ్లునిండిన వారు జనవరి 22 వరకు దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు. ఈనెల 21న అన్ని పోలింగ్ కేంద్రాలలో జిల్లా వ్యాప్తంగా స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు, పోలింగ్ కేంద్రాలలో బి.ఎల్.ఓ లు అందుబాటులో ఉంటారని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఫిబ్రవరి 8వ తేదీన తుది జాబితా విడుదల చేస్తామని ఆమె తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె. శ్రీనివాస్, కలెక్టరేట్ ఏఓ. మోతి లాల్, సూపరింటెండెంట్ కృష్ణ మూర్తి, ఎలక్షన్స్ డీటీ విజయ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటాలు చేయాలి :జూలకంటి

నవతెలంగాణ-మిర్యాలగూడ



ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కోరారు.శనివారం పట్టణంలో నిర్వహించిన సుందనగర్‌శాఖ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సుందనగర్ ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యలను గుర్తించాలని వాటి పరిష్కారం కోసం కార్యాలయాల వద్ద పోరాటాల నిర్వహించి అధికారులపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు అందేవిధంగా కార్యకర్తలు చేయాలన్నారు. పట్టణంలోని అనేక సమస్యలు పేరుకుపోయి ఉన్నాయని వారి పరిష్కారంకోసం దశలవారి ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఎప్పటికప్పుడు శాఖ సమావేశాలు నిర్వహించుకుని రాజకీయంగా చైతన్యవంతులు కావాలని కోరారు. పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయాలన్నారు. ఈనెల 23న నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహిస్తున్నామని పార్టీ సభ్యులు సకాలంలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా కమిటీ సభ్యులు డాక్టర్ మల్లు గౌతమ్‌రెడ్డి,రాగిరెడ్డి మంగారెడ్డి, శాఖ కార్యదర్శి ఆకారపు రాములు, సహాయ కార్యదర్శి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగుల సంక్షేమానికి ఆహార సంస్థ అత్యంత ప్రాధాన్యత

- జనరల్ మేనేజర్ జి ఎస్ .రాజు

నవతెలంగాణ-నల్లగొండటౌన్

ఉద్యోగుల సంక్షేమానికి భారత ఆహార సంస్థ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, సంస్థ తెలంగాణా ప్రాంత జనరల్ మేనేజర్ జీఎస్.రాజు అన్నారు.శనివారం భారత ఆహార సంస్థ నల్గొండ జిల్లా కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన క్రెచే (శిశు విహార్) ను ప్రారంభించారు అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రసూతి ప్రయోజన చట్టం - 1961 ప్రకారం, ఆయా కార్యాలయాల్లో ఉద్యోగుల పిల్లల సంరక్షణకు శిశు విహార్ ను ఏర్పాటు చేయాలనీ, ఈ విషయమై తెలంగాణా వ్యాప్తంగా తమ సంస్థ కార్యాలయాల్లో పనులు చురుగ్గా సాగుతున్నాయని ఆయన తెలిపారు.అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని, అతి తక్కువ సమయంలో శిశు విహార్ ను చక్కగా అభివృద్ధి చేయటంలో చొరవ తీసుకున్న అధికారిణి కృష్ణవేణి, తదితరులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో సంస్థ నల్గొండ డివిజనల్ మేనేజర్ సుశీల్ కుమార్ సింగ్, ఏజీఎం (క్యూ సి) డా. రతీశ్ చంద్రన్, మేనేజర్లు ప్రసాద్, రఘుపతి, రవి కుమార్ బీ కే ఎస్ కే యూనియన్ నాయకులు సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పవర్ ప్లాంట్ నిర్వాసితులకు న్యాయం చేయాలి

నవతెలంగాణ-దామరచర్ల



నల్లగొండ జిల్లాలో దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామ సమీపంలోని యాదాద్రి థర్మల్ విద్యుత్ పవర్ ప్లాంట్ భూ నిర్వాసితులకు ఇప్పటికైన సంపూర్ణమైన న్యాయం చేయాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మాలోత్ వినోద్‌నాయక్ డిమాండ్ చేశారు.దామరచర్లలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పవర్ ప్లాంట్ 36 వేల కోట్ల రూపాయలతో నిర్మాణం చేపట్టగా అనేక ప్రైవేట్ కంపెనీలతో ప్రభుత్వ యంత్రాంగం ప్రైవేట్ కంపెనీ వారితో కుమ్మక్కై కోట్ల రూపాయల కుంభకోణం చేస్తూ పనులు నిర్వహించడం జరుగుతోందని విమర్శించారు.ఈ విషయంపై అనేకసార్లు నిరసన కార్యక్రమాలు చేసినప్పటికీ అప్పటికి ఎవరు పట్టించుకోలేదని చెప్పారు. ప్రభుత్వ యంత్రాంగం ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యం వలన ఈ పవర్ ప్రాజెక్టు యొక్క వ్యయం రోజు రోజుకు పెరిగిపోయిందన్నారు.పవర్ ప్రాజెక్టు నిర్మాణం కొరకు భూములు కోల్పోయిన నిజమైన రైతాంగానికి నేటికీ పూర్తిస్థాయిలో నష్టపరిహారం ఇవ్వలేదని చెప్పారు. అధికార యంత్రాంగం మాత్రం 80 నుంచి 90శాతం నష్టపరిహారం ఇచ్చినట్లు తప్పుడు సమాచారం ఇస్తున్నట్టు చెప్పారు. ప్రాజెక్టు నిర్మాణం కొరకు రెండు గిరిజన తండాలను పూర్తిస్థాయిలో ఖాళీ చేయించినప్పటికి నేటికీ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ద్వారా ఇళ్ల నిర్మాణం పూర్తి చేయలేదని చెప్పారు.భూములు కోల్పోయిన వారికి ఉద్యోగ నియమకాలు కూడా ఇప్పటివరకు జరగలేదని చెప్పారు.నూతన ప్రభుత్వం ఈ పవర్ ప్రాజెక్టు పై పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టాలని కోరారు. విజిలెన్స్ కమిటీ లోతుగా అప్పుడు ఉన్నటువంటి క్రింది స్థాయి అధికారి నుండి కలెక్టర్ స్థాయి వరకు అందరూ అధికారులతో పాటు జెన్కో, ట్రాన్స్‌కో అధికారులను కూడా విచారిస్తే వాస్తవాలు వెలుగుచూస్తాయని చెప్పారు. భూములు కోల్పోయిన రైతాంగం అందరికీ కూడా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఎవరైతే అవినీతి చేశారో వారు ఎంతటి వారినైనా ఉపేక్షించకుండా కఠినశిక్షఅమలు చేయాలన్నారు.వారి దగ్గర నుండి రికవరీ చేయించి రైతాంగానికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పాపానాయక్, ఎర్రనాయక్, కోటిరెడ్డి, దయానంద్, ఖాజామొహిద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి
దాతలు ముందుకు రావడం అభినందనీయం

నవతెలంగాణ-మిర్యాలగూడ



ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని మండల విద్యాధికారి బాలాజీనాయక్ పేర్కొన్నారు. మండలంలోని జప్తి వీరప్ప గూడెం ప్రాథమిక పాఠశాలలో మాజీ ఎంపీపీ పెలపొలు తిరుపతమ్మ ఆర్థిక సహకారంతో శనివారం విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో అన్ని వర్గాలను ఆదరించే ప్రభుత్వ పాఠశాలల మౌలిక వసతులు అవసరాలను తీర్చుటకు ప్రజా ప్రతినిధులు ముందుకు రావడం గొప్ప విషయమని తెలిపారు. సమాజ సహకారంతో ఉపాధ్యాయుల తల్లిదండ్రుల సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేసి తల్లిదండ్రుల సూచనల మేరకు పాఠశాలల నిర్వహణ చేపట్టాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలు సమాజానికి దూరమైతే కొన్ని వర్గాలు విద్యకు దూరమవుతారని, అన్ని వర్గాలను ఆదరించే పాఠశాలను బలోపేతం చేయుటకు దాతలు చేయుట అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పరిషత్ అధ్యక్షులు పెలపోలు తిరుపతమ్మ, పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయులు గరినే సాంబశివరావు, ప్రధానోపాధ్యాయులు అల్లం అనంతరెడ్డి, ఆడోతు చిన్న వెంకన్న, శ్రవణ్, కవిత,పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మెన్ రాంబాబు, యాదయ్య, పెంటమ్మ, రాణి, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.10వేల ఆర్థిక సహాయం

నవతెలంగాణ-తిరుమలగిరిసాగర్

మండలకేంద్రానికి చెందిన మునగాల జానకిరాములు శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు.ఈ విషయం తెలుసుకున్న సమాజ సేవకులు పగడాల సైదులు యాదవ్ జానకిరాములు పార్థివదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంతిమ సంస్కారాల కోసం రూ.10 వేలు మృతుడి తల్లి మునగాల సౌభాగ్యమ్మకు ఆర్థికసాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో బత్తుల సత్యనారాయణ, గుంటోజు వాసుదేవాచారి, బుయ్య సైదులు, ఒబులునేని సురేశ్, తధితరులు పాల్గొన్నారు.





ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బేటీ బచావోబేటీ పడావో

నవతెలంగాణ-దేవరకొండ

దేవరకొండ మండలంలోని ఇదంపల్లి,శేరిపల్లి, రత్యాతండా గ్రామంలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బేటి బచావో బేటి బడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్లు నేనావత్ రాధా, డి చిట్టెమ్మ మాట్లాడుతూ బాల్యవివాహాలు, అక్రమ రవాణాలు, సెక్సియో రేషియో, ఆడపిల్లలను చదివించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లోకసాని సరిత శ్రీనివాస్‌రెడ్డి,స్కూల్ హెడ్‌మాస్టర్ నరేందర్, అంగన్వాడీ టీచర్ స్వప్న, కవిత, పరిమళ, సువర్ణ, సునీత,సుజాత,శాంతాబాయి, పద్మ, బంగారి, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బత్తాయి చెట్లు నరికివేత

- గుర్తు తెలియని వ్యక్తులు నరికిన 170 బత్తాయి చెట్లు
- భూ తాగాదాలే కారణమంటున్న బాధితుడు
- శుక్రవారం అర్ధరాత్రి ఘటన
- తనకు న్యాయం చేయాలని వినతి

నవతెలంగాణ-పెదపూర



పెద్దవూర మండలం ఉట్లపల్లి గ్రామ రెవెన్యూ శివారులోని ఉట్లపల్లి గ్రామానికి చెందిన సర్వే నంబర్ 291లో బోదాసు మల్లయ్య, బోదాసు సత్తయ్యకు సంబందించిన 6.20 ఎకరాలు భూమి వుంది. అయితే రెండు సంవత్సరాల కింద తనకున్న భూమిలో దొండతోటలో 230 బత్తాయి చెట్లు నాటాడు.290 సర్వే నంబర్‌లో భూతరాజు సాయన్న వ్యవసాయ భూమి వుంది. అయితే 19ఏండ్ల కింద బోదాసు మల్లయ్యకు భూమిలో ఉన్న దానికంటే ఎక్కువ భూమి ఉందని 2005 లో కొలిపించారు.అందులో 31 గుంటల భూమి ఎక్కువ వుంది.అయితే 14000రూపాయలు అప్పట్లో సాయన్నకు పెద్దమనుషులు సమక్షంలో మల్లయ్య చేత ఇప్పించారు.అప్పటినుంచి ఈ సమస్యకు తెర పడింది. ధరణి వచ్చిన తరువాత మల్లయ్య 31 గుంటల భూమి సాయన్న భూరికార్డులోకి ఎక్కింది. దాంతో సంవత్సరం కాలంగా ఇద్దరి మధ్య మళ్ళీ గొడవలు మొదలయ్యాయి.ఈ నేపథ్యంలో శుక్రవారం అర్ధరాత్రి మల్లయ్య నాటిన 170 బత్తాయి చెట్లను నరికి వేశారని బాధిత రైతు మల్లయ్య తెలిపారు.శనివారం బాధితుడు మల్లయ్య నరికిన చెట్లను చూసి రోదిస్తూ అనుమానితులపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు.ఈ విషయమై తనకు న్యాయం చేయాలని కోరారు.

స్నేహితునికి ఆర్థికసాయం అందజేత

నవతెలంగాణ-మద్దిరాల

తన స్నేహితుని భార్య చనిపోవడం,అతని పిల్లలు ఎదుగుతుండడం,ఆర్థిక పరిస్థితి,దిగజారి పోవడం గమనించిన మిత్రులు శనివారం ఆర్థికసాయం అందజేశారు. మండలంలోని రెడ్డిగూడెంకు చెందిన నాగెళ్లి ఉపేందర్ చిన్నవయస్సులోనే భార్య ఇటీవల చనిపోయింది.తనకు ఇద్దరు పిల్లలు, ఉపేందర్ ఆర్థిక పరిస్థితి బాగా లేదని గమనించిన పదవ తరగతి మిత్రులు స్నేహితునికి ఎంతోకొంత ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని తలంచి మిత్రులందరూ కలిసి రూ.15 వేలను ఆర్థికసాయంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో బరపటి ఉపేందర్, బెడద రవి, వెలుగు సైదులు, కొమ్ము మల్లయ్య బ్రహ్మదేవర కవిత, బూర్గుల హరికృష్ణ, వెలుగు రమేష్,అంకటి శ్రీను,ఆర్తి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



నేడు మండలంలో మంత్రి ఉత్తమ్ పర్యటన

నవతెలంగాణ-మఠంపల్లి

నేడు మండలంలో వివిధ గ్రామాల్లో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాల ప్రారంభానికి భారీ నీటిపారుదల, పౌరసారపరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రానున్నారు. ఈవిషయమై శనివారం ప్రభుత్వం తరఫున అధికారిక ప్రకటన విడుదల చేశారు.కాల్వపల్లి తండా, కొత్తదొనబండతండా, లాలితండాలలో గ్రామపంచాయతీ భవనాలు ప్రారంభించనున్నారు.మంత్రి అయిన తర్వాత అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మొదటిసారిగా రానుండడంతో అధికారులు,నాయకులు,కార్యకర్తలు వారివారి ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.



కేంద్ర ప్రభుత్వ మత రాజకీయాలను తిప్పికొట్టాలి

• సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-సూర్యాపేట

బీజేపీ చేస్తున్న మత రాజకీయాలను ప్రజలు తిప్పి కొట్టాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు.శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సీఐటీయూ,ఐఎన్‌టీయూసీ,ఇఫ్టు కార్మిక సంఘాల సంయుక్త సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని విమర్శించారు. కార్పొరేట్, మతోన్మాద, నయా ఉదారవాద విధానాల వలన కార్మిక వర్గం, రైతాంగం, పేద ప్రజల నుండి వచ్చే వ్యతిరేకతను గుర్తించి రాబోయే పార్లమెంట్‌ఎన్నికల్లో గెలుపు కోసం బీజేపీ మత రాజకీయాలకు తెరలేపుతూ అయోధ్య రామ మందిరాన్ని ముందుకు తీసుకువచ్చిందన్నారు.ఇంకా పూర్తిగా నిర్మాణం కానీ అయోధ్య రామ మందిరంలో విగ్రహ ప్రతిష్ఠచేయడం సరికాదని పెద్ద పీఠాధిపతులు సూచించినా కూడా పట్టించుకోకుండా పార్లమెంట్ ఎన్నికల ముందే కార్యక్రమాన్ని తీసుకుందని విమర్శించారు.అక్షింతల పేరుతో ప్రతి ఇంటికి వెళుతూ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యలను పక్కదారి పట్టించే విధంగా ప్రజల్ని మతం మత్తులో ముంచుతున్నారని విమర్శించారు.బీజేపీ చేస్తున్న మత రాజకీయాలను తిప్పి కొట్టడంలో భాగంగా దేశంలోని కార్మిక వర్గం , రైతాంగం , ప్రజలందరినీ చైతన్యం చేయడం కోసం దేశంలోని అన్ని జాతీయ కార్మిక సంఘాలు , (రైతు సంఘాల ఐక్యవేదిక) సంయుక్త కిసాన్ మోర్చా, అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం, అఖిల భారత కిసాన్ సభలు సంయుక్తంగా ఫిబ్రవరి 16 న దేశవ్యాప్తంగా గ్రామీణ బంద్ , పారిశ్రామిక బంద్‌కు పిలుపునిచ్చారు.ఈ నెల 24 న సీఐటీయూ జిల్లా కార్యాలయంలో అన్ని కార్మిక సంఘాలతో జాయింట్ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈనెల 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా అన్ని నియోజక వర్గాలలో కార్మిక సంఘాలతో పాటు రైతు, వ్యవసాయ సంఘాలు కలిసి ట్రాక్టర్, ఆటో, బైక్‌ర్యాలీలు పెద్దఎత్తున నిర్వహించాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో ఇఫ్టు జిల్లా కార్యదర్శి గంట నాగయ్య ఐఎన్‌టీయూసీ పట్టణ అధ్యక్షుడు రెబల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



మామిడితోటలపై సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి

• కేవీకే ఉద్యానవనశాస్త్రవేత్త నరేష్

నవతెలంగాణ-నూతనకల్

రైతులు మామిడి తోటలపై సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటించి అధికదిగుబడులు సాధించాలని కెవికె ఉద్యాన శాస్త్రవేత్త హెచ్.నరేష్,డి.ఆదర్స్ రైతులకు సూచించారు.శనివారం మండలపరిధిలోని వెంకేపెల్లి లో కృషి విజ్ఞానకేంద్రం, గడ్డిపల్లిశాస్త్రవేత్తలు, ఆధ్వర్యంలో నిర్వహించిన మామిడితోటల రైతుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.రైతులు మామిడి తోటలలో తీసుకోవాల్సిన ఎరువుల యాజమాన్యం, ప్రస్తుతం సమయంలో పూత రావడానికి మల్టీ కే (13:0:45) 10 గ్రాములు, ప్లానోఫిక్స్ 0.25ఎంఎల్ లీటర్ నీటికి పిచికారీ చేయాలన్నారు. పిందె దశలో నీటి యాజమాన్యం, జీవన ఎరువుల వినియోగం, కోత దశలలో తీసుకోవాల్సిన పద్ధతులను వివరించారు.మామిడి తోటలలో పండు ఈగ తీవ్రత కారణాలు తెలుసుకొని నివారణ చర్యలు పాటించాలని సూచించారు.ఉద్యాన అధికారిణి స్రవంతి మాట్లడుతూ ఉద్యాన శాఖ ద్వారా ఇస్తున్న సబ్సిడీ, ఆయిల్ ఫామ్ పంట సాగు విధానంలో ఆధునిక పద్ధతుల్లో పాటించాలని రైతులకు సూచించారు.అనంతరం రైతులకు మామిడి పంటలో కత్తిరింపులు గురించి డెమో చూపించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుధీర్ రెడ్డి, రైతులు. బుచ్చిరెడ్డి,పాల్వాయి వెంకటమల్లు, కొమ్ము వెంకన్న, చెరకు సుందరయ్య మల్లారెడ్డి యూనివర్సిటి, వ్యవసాయ విధ్యార్థులు పాల్గొన్నారు.





'ఓటునమోదు చేసుకోవాలి'

నవతెలంగాణ-నూతనకల్

18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటును నమోదు చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు.ఓటరు నమోదు ప్రత్యేక ప్రచారంలో భాగంగా శనివారం మండలపరిధిలోని మిర్యాల, పెదనెమిల గ్రామాలలో ఉన్న పోలింగ్‌స్టేషన్లను పర్యవేక్షించి ప్రతి బీఎల్వో ఓటు నమోదుపై అవగాహన కల్పించాలన్నారు.ఈకార్యక్రమంలో బీఎల్వోలు పాల్గొన్నారు.

కాండంతొలుచు పురుగు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

నవతెలంగాణ-మునగాల

వరి పంటల్లో ఉధృతంగా వున్న కాండం తొలుచు పురుగు నివారణకు రైతులు వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కోదాడ వ్యవసాయ సంచాలకులు టి.వాసు,మండల వ్యవసాయాధికారి బాణోత్ అనిల్‌కుమార్ తెలిపారు.శనివారం మునగాల రెవెన్యూలో సాగుచేసిన వరి పంటలను వారు పరిశీలించి మాట్లాడారు.ఈ యాసంగిలో సాగు చేసిన వరి పంటలపై మొగిపురుగు ఆశించినట్లు తెలిపారు.సరైన సమయంలో నివారణా చర్యలు చేపట్టకపోతే వరి పంటలకు నష్టం జరుగుతుందన్నారు. మొగిపురుగు ఉన్నట్టు గుర్తిస్తే కార్టోప్ హైడ్రోక్లోరైడ్ 350గ్రాముల మందు ను 200లీటర్ల నీటితో కలిపి పిచికారీ చేయాలన్నారు.మరో పద్ధతిలో కార్టోప్ హైడ్రోక్లోరైడ్ 4.జీ గుళికలు ఎకరానికి 6 కిలోలు. లేదా కార్బోఫ్యూరాన్ గుళికలు ఎకరానికి 8కిలోల వంతున చల్లి తెగుళ్ళను నివారించవచ్చున్నారు.ఇంకా వరి పంటల్లో సూక్ష్మదాతు లోపం ఉన్నట్టు తెలిపారు.తెగుళ్ళ నివారణ కోసం పంటలపై నత్రజని వినియోగం తగ్గించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తణాధికారులు ఉప్పయ్య,నాగు,ముస్తఫా, పాల్గొన్నారు.



29న పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్ఎంసీ)ఎన్నికల నిర్వహణ

నవతెలంగాణ-నూతనకల్

ఈనెల 29న పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలను నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి రాములు నాయక్ తెలిపారు.శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నికల నోటీసులు విడుదల చేసి మాట్లాడారు.మండలపరిధిలోని ఆయా గ్రామాలలో పాఠశాలలో కమిటీ ఎన్నికలను నిర్వహించనున్నట్లు ప్రతి తరగతి నుండి ముగ్గురు సభ్యులను, చైర్మెన్,వైస్‌చైర్మెన్, ఎక్స్ ఆఫీషియో సభ్యులను,కో ఆప్టేట్ సభ్యులను ఎన్ను కోనున్నట్లు తెలిపారు.ఆయా పాఠశాలలో సంబంధిత విద్యా ర్థుల జాబితాలను విడుదల చేసి, ఆ తరువాత జాబితాపై అభ్యం తరాలను స్వీకరించి తుది జాబితాను విడుదల చేసి అనంతరం ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణ చేపట్టి తొలి సమావేశం నిర్వహించాలని జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేశారన్నారు.



ప్రశాంతంగా ముగిసిన నవోదయ ప్రవేశపరీక్ష

• 208 మంది విద్యార్థులకు గాను 172 మంది విద్యార్థులు హాజరు

నవతెలంగాణ-తుంగతుర్తి

జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ప్రశాంతంగా ముగిసింది. ఈ మేరకు వివిధ దూరప్రాంతాల నుంచి తల్లిదండ్రులు విద్యార్థులను ఉదయాన్నే పరీక్ష కేంద్రం వద్దకు చేరుకున్నారు.ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి బోయిని లింగయ్య మాట్లాడుతూ 208 మంది విద్యార్థులకు గాను 172 మంది హాజరైనట్లు,36 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.ఉదయం 11: 30 నుంచి మధ్యాహ్నం 01:30 వరకు పరీక్ష జరిగినట్లు,పరీక్ష కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



'బీజేపీతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యం'

నవతెలంగాణ-తుంగతుర్తి

బీజేపీతోనే ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధ్యమని ఆపార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెపాక సాయిబాబా అన్నారు.శనివారం మండలకేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు.ఎన్నికలకు ముందు ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన హామీ ప్రకారం కేంద్ర కాబినెట్ కార్యదర్శి రాజీవ్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేయడం హర్షణీయం అన్నారు.ఎస్సీ వర్గీకరణకు కేంద్రం సానుకూలంగా ఉందని,ఏడుగురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనాన్ని ఏర్పాటు చేసి వేగవంతంగా చర్యలు తీసుకుంటున్నట్టుతెలిపారు.బీజేపీతోనే మాదిగలకు,దళితులకు న్యాయం జరుగుతుందని,మోడీపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉందని ప్రధానిగా మూడోసారి మోడీనేనన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

నవతెలంగాణ-కోదాడరూరల్

పట్టణంలోని సీసీరెడ్డి పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలల్లో శనివారం జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా పకడ్బందీగా నిర్వహించినట్టు మండల విద్యాధికా సలీం షరీఫ్ శనివారం తెలిపారు.రాబోయే విద్యా సంవత్సరంలో ఆరవ తరగతిలో ప్రవేశం పొందేందుకు ప్రస్తుత సంవత్సరం ఐదవ తరగతిలో ఉండి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ప్రవేశ పరీక్ష ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1:30 వరకు నిర్వహించారు. బాలికల ఉన్నత పాఠశాలలో 201 మంది విద్యార్థులకు గాను 37 మంది గైర్హాజరు కాగా 164 మంది హాజరయ్యారు. అలాగే సెయింట్ జోసెఫ్ సీసీ రెడ్డి పాఠశాలలో 216 మంది విద్యార్థులకు గాను 36 మంది గైర్హజరుకాగా 180 మంది హాజరయ్యారు. కాగా ఆర్డీఓ సూర్యనారాయణ పర్యవేక్షించారు.





వైద్య సేవల పరిరక్షణకే జనఆరోగ్య సమితి

• సర్పంచ్ తీగల కరుణ శ్రీ గిరిధర్‌రెడ్డి

నవతెలంగాణ-నూతనకల్

క్షేత్రస్థాయి వైద్య సేవల పరిరక్షణ కోసమే జన ఆరోగ్య సమితి ఏర్పాటు చేశామని సర్పంచ్ తీగల కరుణశ్రీ గిరిధర్‌రెడ్డి అన్నారు.శనివారం మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో నిర్వహించిన జన ఆరోగ్య సమితి సమావేశంలో ఆమె మాట్లాడారు.ప్రజల కోసం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం,ఉపకేంద్రాలలో నిర్వహించే అన్ని రకాల సదుపాయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఎలాంటి సమస్యలు ఉన్నా ఆరోగ్య జన సమితికి తెలియజేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం జ్యోతి,హెల్త్ అసిస్టెంట్ నగేశ్, నూతనకల్, యడవెల్లి గ్రామాలకు చెందిన ఆశా కార్యకర్తలు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా జెడ్పీటీసీ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-అర్వపల్లి

మండలకేంద్రంలో జెడ్పీటీసీ దావులరవీప్రసాద్‌యాదవ్ జన్మదిన వేడుకలను టీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు.టీఆర్ఎస్ నాయకులు అయన్ను శాలువాతో సన్మానించారు.కేక్ కట్ చేసి పండ్లను పంపిణీచేశారు.ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు కడారి నరేష్‌యాదవ్, చిల్లంచర్ల విద్యాసాగర్, కనుక శ్రీనివాస్,పులిచర్ల ప్రభాకర్, దావులలింగయ్య, గోపాల్,ఓర్సువెంకన్న పుట్టపాక సైదులు ,రవీందర్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

డీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదానం

నవతెలంగాణ-హుజూర్‌నగర్

పట్టణానికి చెందిన డయాలసిస్ పేషెంట్ వెంకటరామయ్యకు రక్తం అవసరం కాగా డీఎస్ఆర్ టెస్ట్ చైర్మెన్‌దగ్గుబాటి బాబురావుకు బాధితుడు విషయం తెలియజేశాడు పట్టణానికి చెందిన నాగేంద్రబాబుకు ఫోన్ చేసి విషయం చెప్పడంతో నాగేంద్రబాబు స్పందించి రక్తదానం చేశారు.ఈ సందర్భంగా డీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మెన్ దగ్గుబాటి బాబురావు మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యానికి మేలు జరుగుతుందని గుండెకు సంబంధించిన వ్యాధులు తగ్గుతాయన్నారు.అదేవిధంగా క్యాన్సర్ బారిన పడకుండా ఉండే అవకాశం ఉందన్నారు శరీరంలో ఐరన్ స్థాయిని సమతుల్యం చేసి రక్తదానం చేసిన వ్యక్తులకు అనారోగ్యాల బారిన పడకుండా కాపాడుతుందన్నారు,అంతే కాకుండా ఆపదలో ఉన్న వారికి ప్రాణదానం చేయవచ్చున్నారు.రక్తదానం ఎన్నిసార్లు చేసినప్పటికీ నష్టమేమీ ఉండదన్నారు.నాగేంద్రబాబు ఇప్పటికే 18 సార్లు రక్తదానం చేసినందున ఆయన్ను అభినందించారు.



సాగర్ నీటిని విడుదల చేసి ఆయకట్టు రైతాంగాన్ని కాపాడాలి

నవతెలంగాణ-పాలకవీడు

నాగార్జునసాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేసి ఆయకట్టు రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఐ(ఎం)పాలకవీడు మండల కార్యదర్శి కందగట్ల అనంత ప్రకాష్ ప్రభుత్వాన్ని కోరారు.శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు.సాగర్ నీరు రాకపోయినా, చెరువులు, బోరుబావులను ఆధారం చేసుకుని కొంతమేర రైతులు వారిని సాగు చేశారని, భూగర్భ జలాలు అడుగంటిపోయి బోర్లలో నీరు లేక బావుల్లో నీరు లేక వేసిన పంట పొలాలు ఎండిపోయే పరిస్థితి ఉన్నదని తెలిపారు.జాన్‌పహాడ్ మేజర్ కింద రైతు వేసిన పంట పొలాలు ఎండిపోయే దశలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే ఉత్తంకుమార్‌రెడ్డి నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్నందున రైతాంగ యొక్క సమస్యలు అర్థం చేసుకొని సాగర్ నీటిని విడుదల చేసి పంటలు కాపాడే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మెన్ పగడాల మట్టేష్, మాజీ సర్పంచ్ సుంకరి క్రాంతికుమార్, మాజీ సర్పంచ్, రైతుసంఘం నాయకులు గుర్రం ధనమూర్తి,కొప్పు రామకృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బైక్‌ర్యాలీని జయప్రదం చేయండి

నవతెలంగాణ-మునగాల

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసిస్తూ ఈనెల 26న కోదాడలో నిర్వహించే ట్రాక్టర్లు,సైకిల్ మోటార్ల ర్యాలీని జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు కోరారు.శనివారం అమరవీరుల స్మారక భవనంలో పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన స్వామినాథన్ కమిటీ సిఫారసులను తుంగలో తొక్కిందన్నారు. వరిధాన్యానికి క్వింటాల్‌కు రూ.3500 రైతుకు ఇస్తామన్న హామీ అమలుకు నోచుకోలేదన్నారు.నిరుద్యోగులకు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన హామీ ఏమైందని ప్రశ్నించారు. రైతు వ్యతిరేక చట్టాలు తెచ్చి రైతులను దివాళా తీయించే ప్రయత్నాలు చేసిందని విమ ర్శించారు. కార్మిక వ్యతిరేక చట్టాలు వ్యవసాయ కూలీల జాతీయ ఉపాధి హామీ చట్టంలో కోతలు విధించి పని దినాలు తగ్గించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.అన్ని గ్రామాల నుండి రైతులు, కార్మికులు అధిక సంఖ్యలో హాజరై ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దేవరం వెంకటరెడ్డి, మండల అధ్యక్షులు చందా చంద్రయ్య ,కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు షేక్ సైదా,వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు ఆరే రామకృష్ణారెడ్డి, సోమపంగు జానయ్య, సీఐటీయూ మండల కార్యదర్శి బచ్చలకూరి స్వరాజ్యం, డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు వట్టెపు చిన్నసైదులు, తదితరులు పాల్గొన్నారు.



రాజ్యాధికారంతోనే యాదవుల సమస్యలు పరిష్కారం

నవతెలంగాణ-తుంగతుర్తి

రాజ్యాధికారంతోనే యాదవుల సమస్యలు పరిష్కారం అవుతాయని,జాతి ఐక్యత కోసం యాదవులంతా కలిసి రావాలని యాదవ రాజ్యాధికార సాధన సమితి జిల్లా అధ్యక్షులు ఉప్పుల నాగమల్లు యాదవ్ అన్నారు.శనివారం యాదవ రాజ్యాధికార సాధన సమితి 2024 క్యాలెండర్‌ను కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్‌తో ఆవిష్కరింపజేసి మాట్లాడారు.ఈ మేరకు యావత్ దేశం బహుజన రాజ్యాధికారం కోసం ఎదురుచూస్తున్న తరుణంలో నా జాతి బిడ్డలను బహుజన రాజ్యాధికారంలో ముందువరుసలో ఉంచాలనే ఉద్దేశంతో బడుగుల నాగార్జునయాదవ్ ఈ యాదవ రాజ్యాధికార సాధన సమితిని స్థాపించారన్నారు.దేశంలో యాదవ జనాభా అత్యధికంగా ఉన్నప్పటికీ, ఆర్థికంగా,సామాజికంగా,విద్యాపరంగా చాలా వెనకబడి ఉందన్నారు.కలిసికట్టుగా హక్కులను సాధించుకోవడానికి, ప్రతి యాదవ బిడ్డ కలిసి రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో వీరబోయిన గంగరాజు యాదవ్, ఉప్పుల రాంబాబు యాదవ్,వీరబోయిన లింగమల్లు,భయ్యా మహేష్ యాదవ్,ఉప్పుల లింగయ్య యాదవ్,సందీప్ యాదవ్, మధుయాదవ్,మున్న మహేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మారోజు వీరన్న 62వ జయంతిని జయప్రదం చేయండి

నవతెలంగాణ-తిరుమలగిరి

ఇండియా విప్లవ సిద్ధాంతకర్త కులవర్గ జంట పోరాట నిర్మాత దళిత బహుజన సామాజిక విముక్తి వ్యవస్థాపక కార్యదర్శి మారోజు వీరన్న 62వ జయంతిని ఈనెల 31వ తేదీన సూర్యాపేట జిల్లాకేంద్రంలో నిర్వహించే జయంతి సభను విజయ వంతం చేయాలని సీపీయూఎస్ఐ అధ్వర్యంలో శనివారం తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలోని తెలంగాణ చౌరస్తా వద్ద కరపత్రం విడుదల చేశారు.ఈ సందర్భంగా సీపీయూఎస్ఐ రాష్ట్ర కార్యదర్శి దైద వెంకన్న మాట్లాడుతూవీరన్న విద్యార్థి దశ నుండి విద్యార్థి యువజన ఉద్యమాలను నిర్మిస్తూ ఉస్మానియా క్యాంపస్ పీడీఎస్‌యూ వీరన్నగా పేరుగాయించారన్నారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా కార్యదర్శి మట్టపెల్లి లింగయ్య, మట్టపెల్లియాదయ్య తిరుమలగిరి మండలకార్యదర్శి కే.సోమేశ్. జయహో రాష్ట్ర నాయకులు ఎస్‌కే.చాంద్‌పాషా, తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఇండ్లను అర్హులకు పంచాలి

నవతెలంగాణ-సూర్యాపేటకలెక్టరేట్

సూర్యాపేట జిల్లా కేంద్రంలో రెండు పడకల గదుల ఇళ్లకేటాయింపులో నిజమైన లబ్దిదారులను కాకుండా ఇండ్లు ఉన్న వారికి ఇవ్వటం జరగాయని సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్లో ఏవో సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు.గత ప్రభుత్వం డ్రా పద్ధతిలో చేపట్టిన రెండు పడకల ఇళ్లను గతేడాది అక్టోబర్‌లో డ్రా పద్ధతి ద్వారా లబ్దిదారులను వార్డు కౌన్సిలర్ అనుకున్నవారికి నచ్చిన వారిని ఎన్నుకున్నారని ఆరోపించారు.ఈ కార్యక్ర మంలో సీనియర్ నాయకులు బొమ్మగాని శ్రీనివాస్, మురగండ్ల లక్ష్మయ్య, నిమ్మల ప్రభాకర్, రేగటి లింగయ్యలు పాల్గొన్నారు.

29న పాఠశాల ఎస్ఎంసీఎలక్షన్లు

నవతెలంగాణ-పెన్‌పహాడ్

మండలపరిధిలోని 52 పాఠశాలల్లో ఈనెల 29వ తారీఖున ఎలక్షన్లు నిర్వహిస్తున్నట్టు మండల విద్యాధికారి నకిరేకంటి రవి ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని ప్రాథమిక పాఠశాలలు 40, ప్రాథమికోన్నత పాఠశాలలు 4, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 8, కేజీబీవీ 1, ఆదర్శ పాఠశాల 1 మొత్తం 52 పాఠశాలలో ఎలక్షన్లకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఈనెల 29న ఎలక్షన్ నిర్వహిస్తున్నట్లు, 23వ తారీఖున అభ్యంతరాల స్వీకరణ తుదిగడువుగా తెలిపారు.చేతులు ఎత్తే పద్ధతి ద్వారా ప్రతి తరగతి నుండి ముగ్గుర్ని ఎన్నుకుంటారు ఈ ఎన్నుకున్న అన్ని తరగతుల నుండి చైర్మెన్,వైస్‌చైర్మెన్‌ను ఎన్నుకుంటారని, ఈ ఎన్నికల నిర్వహణకు తప్పనిసరిగా 50శాతం కోరం హాజరైతేనే ఎన్నికలు జరుగుతాయని తెలిపారు.

ఆటో దొంగిలించిన వ్యక్తి అరెస్టు

నవతెలంగాణ-కొండమల్లేపల్లి

ఈనెల 16వ తేదీన కొండమల్లేపల్లిలోని ఓ ఇంటి ముందు పార్కింగ్ చేసి ఉన్న ఆటోను దొంగలించిన నిందితున్ని పోలీసులు వెతికి పట్టుకొని శనివారం అరెస్టు చేసి రిమాండ్ పంపుతున్నట్లు సీఐ రాఘవేందర్‌రెడ్డి విలేకర్లకు తెలిపారు.సీఐ తెలిపిన వివరాల ప్రకారం రంగారెడ్డి జిల్లా, ఆమనగల్ గ్రామానికి చెందినటువంటి కొప్పుల మహేష్ అలియాస్ సాయి తండ్రి యాదయ్య నిందితుడు ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 16వ తేదీన కొండమల్లేపల్లి గ్రామానికి చెందిన మూడవత్ సుభియా, తనఇంటి ముందు పార్క్ చేసినటువంటి ఏపీ 24 టి సి 3157 నెంబర్ గల తన ఆటోను రాత్రి ఒంటిగంట సమయంలో గుర్తుతెలియని దుండగుడు అపహరించిపోవడంతో వెంటనే బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని సీసీ కెమెరాల ఆధారంగా నిందితున్ని దేవరకొండస్టేజీ కోల్‌ముంతల్ పహాడ్ గుర్తించి కేసు నమోదు చేసి రిమాండుకు పంపనున్నట్లు వారు తెలిపారు. గతంలో పలు చోరీలకు పాల్పడినాడని అన్నారు. ఈ సందర్భంగా నిందితున్ని పట్టుకున్నటువంటి ఎస్సై వీరబాబును మరియు పోలీస్ సిబ్బంది అయినటువంటి హేము నాయక్, వెంకటేష్, భాస్కర్ లను సీఐ రాఘవేందర్ రెడ్డి అభినందించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
యాదాద్రి భువనగిరి
ఆదివారం | జనవరి 21. 2024 | www.navatelangana.com

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టి సారించాలి

నవతెలంగాణ-ఆలేరుటౌన్



జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టి సారించాలని ఆలేరు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మొహమ్మద్ ఖుర్షీద్ పాషా అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహంలో జరిగిన ప్రెస్ క్లబ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన ప్రభుత్వం జర్నలిస్టులందరికీ హెల్త్ కార్డులు అందజేయాలని, కేంద్రం తో మాట్లాడి రైల్వే లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలన్నారు. ఈ సమావేశం లో ప్రధాన కార్యదర్శి కొరుటూరి ఉపేందర్, ఉపాధ్యక్షులు మోరిగాడి మహేష్, కూళ్ల సిద్దులు, కోశాధికారి సిరిగిరి స్వామి, సహాయ కార్యదర్శులు యెలగల కుమారస్వామి, పోతుగంటి సంపత్, సభ్యులు పీ. మాధవరెడ్డి, సామల సిద్దులు, చింతకింది వెంకటేష్, ఎం.డి జహంగీర్, ఎర్రోజు రాజు, బోడ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన



నవతెలంగాణ-చౌటుప్పల్‌రూరల్

చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం సైబర్ నేరాలపై చౌటుప్పల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.దేవేందర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫేస్బుక్, ఇంస్టాగ్రామ్, ఓటిపి, ఇన్వెస్ట్మెంట్, బెట్టింగ్ లపై సైబర్ నేరాలకు మోసపోకుండా జాగ్రత్త వహించాలని విద్యార్థులకు సూచనలు సలహాలు ఇచ్చారు. మోసపోయామని గ్రహిస్తే వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.దుర్గయ్య,ఎస్ఎంసి చైర్మన్ కైరంకొండ అశోక్,ప్రాథమిక పాఠశాల చైర్మన్ వర్కాల రఘురాం తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలి

- కలెక్టర్ హనుమంతు కే జెండగే

నవతెలంగాణ-భువనగిరి



18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ హనుమంతు కే జెండగే కోరారు. పట్టణంలోని బాహర్ పేట్ 83, 85, 93, 94, 96 పోలింగ్ కేంద్రాలలో, బీబీనగర్ లోని 139,140, 141 పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక ఓటరు క్యాంపులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ... జిల్లాలో నేడు అన్ని పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయని, ఉదయం 9.00 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు బూత్ లెవెల్ అధికారులు అందుబాటులో ఉంటారని, అర్హులైన, 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, తమ ఓటు నమోదు చేసుకోవాలని, ఓటు నమోదుకు ఫామ్ 6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అధికారులు ఆబ్సెంట్, మరణించిన ఓటర్లను, ఫామ్ 8 మార్పులకు సంబంధించి నిబంధన ప్రకారం పరిశీలించి తొలగించాలని తెలిపారు. కొత్త ఓటర్ల నమోదుకు అవగాహన కల్పించాలని, 18 ఏండ్లు యువ ఓటర్లను క్షేత్రస్థాయిలో గుర్తించాలని సూచించారు. జనవరి 25 వ తేదీ జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా క్షేత్రస్థాయిలో ఓటరు నమోదుకు ప్రోత్సాహక కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమాలలో తహసిల్దార్లు అంజిరెడ్డి, శ్రీధర్, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అజయానంద ఖండూరి

నవతెలంగాణ-ఆలేరుటౌన్



ఆలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం వరంగల్ పదవ తెలంగాణ బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ అజయానంద్ ఖండూరి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, ఎన్సిసి విద్యార్థులతో ఇంటరాక్ట్ అయ్యారు. ఉపాధ్యాయుల ఉద్దేశించి కల్నల్ అజయానంద ఖండూరి మాట్లాడుతూ ఆలేరు పాఠశాలలో ఎన్‌సీసీ చాలా పేరుపొందిందని, దీనికి ఎన్‌సీసీ అధికారితో పాటు ఈ పాఠశాల ఉపాధ్యాయుల కృషి ఎనలేనిదని అన్నారు. ఆలేరు ఎన్‌సీసీ విద్యార్థులకు బెటాలియన్‌లో మంచి పేరు తేవడానికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. రాబోయే కాలంలో సహకార భావనతో విద్యార్థులను ఎన్‌సీసీలో చేరేలా ప్రోత్సహించాలని, తద్వారా పరోక్షంగా దేశ రక్షణలో పాలుపంచుకోవాలని ఉపాధ్యాయులను కోరారు. ఎన్‌సీసీలో ఎనలేని సేవ చేస్తున్న అధికారి దూడల వెంకటేష్ ఈ సందర్భంగా అభినందించారు. ప్రతిసారి ఈ పాఠశాల ఎన్సిసి విద్యార్థులు ఐఐటీలో సీట్లు పొందడం సంతోషమని, ఈ కార్యక్రమంలో ఎన్సిసి అధికారి దూడల వెంకటేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్యామసుందరి, ఉపాధ్యాయులు శేఖర్, సోమరాజు, యోగేశ్వరరావు, హరినాథ్ రెడ్డి, సాంబశివ, ఖాజా అలీ, నవీన్, రవి, వేణు, విజయలక్ష్మి, కవిత, స్వర్ణలత, లక్ష్మమ్మ మీరా తదితరులు పాల్గొన్నారు.

భ్రూణ హత్యలను నిర్మూలించాలి



- జెడ్పీటీసీ గోలి ప్రణీత

నవతెలంగాణ-బీబీనగర్

భ్రూణ హత్యలను నిర్మూలించాలని జెడ్పీటీసీ గోలి ప్రణీత పింగల్ రెడ్డి అన్నారు. శనివారం బీబీనగర్ గ్రామపంచాయతీ ఆవరణలో మిషన్ శక్తి - జిల్లా మహిళా సాధికారిక విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జాతీయ బాలిక దినోత్సవాల వేడుక కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సందర్భంగా గ్రామ సర్పంచ్ మల్లగారి భాగ్యలక్ష్మి శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజంలో మహిళలు రాణించాలని అన్నారు. నేటి సమాజంలో బాలిక - బలురా నిష్పత్తి చాలా తక్కువ ఉందని కావున అంగన్వాడి, ఆశ వర్కర్లు ఫీల్డ్ లో ఉంటూ ఆడపిల్ల అంటూ చేయబోతున్న భ్రూణహత్యలను నిర్మూలించాలని మార్గ నిర్దేశం చేశారు. ఆడపిల్లలు సమాజానికి మణిహారం లాంటివారని, ఆడవాళ్లకు రక్షణ కల్పించాలని, వారి బంగారు భవితకు పునాదులు వేయాలని, స్వచ్ఛమైన వాతావరణాన్ని, పోషకాహారాన్ని అందించి వారి అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన తర్వాతనే ఆడపిల్లలకు వివాహం చేయాలన్నారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దస్తగిరి, వార్డు సభ్యులు రోడ్డ యమునా, సామల వేణు, రాఘవేందర్, పంచాయతీ కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి, అంగన్వాడి టీచర్స్, ఆశ వర్కర్లు, మహిళలు, యువత, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శిగా అనిల్



నవతెలంగాణ-అడ్డగూడూరు

మండల కేంద్రంలో శనివారం మాల మహానాడు జిల్లా అధ్యక్షులు మెట్టు హరి ఆధ్వర్యంలో మండలంలోని కంచనపల్లి గ్రామానికి చెందిన చీపూరి అనిల్‌ను మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన మాల మహానాడు మండల నాయకుల అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్డగూడూరు మండల మాలమహానాడు అధ్యక్షులు మండల లతీఫ్ , మరియు వివిధ గ్రామాల అధ్యక్షులు రేకల ఆంధ్రయ, కరుణాకర్, బందల కిష్టయ్య, అల్లే సుధాకర్, అంజయ్య, ఎడ్ల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల స్టడీ మెటీరియల్ అందజేత

నవతెలంగాణ-రామన్నపేట



ఆసర స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో శనివారం మండలం కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు వచ్చే విద్యాసంవత్సరంలో ఐదో తరగతి గురుకుల పాఠశాలలో చేరేందుకు అవసరమయ్యే స్టడీ మెటీరియల్ ను సంస్థ అధ్యక్షుడు మేడి హరికృష్ణ అందజేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 11న నిర్వహించే గురుకుల ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు సన్నద్ధమయ్యేందుకు స్టడీ మెటీరియల్ ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన అన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు గురుకుల విద్య వరమని, ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్టడీ మెటీరియల్స్ ను ఉపయోగించి గురుకులాల్లో సీటు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెద్దిరెడ్డి శంకర్ రెడ్డి, ఉపాధ్యాయులు జి.అండమ్మ పి.భార్గవి, సంస్థ సభ్యులు గిరిబాబు, ఏల్లాచారి, శివసాయి, లింగస్వామి, సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వం మోసం

నవతెలంగాణ-గుండాల



కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజులలో ఎస్సీ వర్గీకరణ చేస్తామని సంవత్సరాలు గడిచిన చేయకపోవడం మాదిగలను మోసం చేయడమేనని ఎమ్మార్పీఎస్ (దండోరా) ఆలేరు ఇన్‌చార్జ్ క్యాసగల్ల రమేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికైనా వర్గీకరణ చేసి మాదిగలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా మాదిగ జాతి అభివృద్ధి పథంలోకి రావాలంటే మేడి పాపయ్య మాదిగ నాయకత్వాన్ని బలోపేతం చేయాలని కోరారు.

ఎమ్మార్పీఎస్ (దండోరా) మండల కన్వీనర్‌గా ప్రమోద్

ఎమ్మార్పీఎస్ మండల నూతన కార్యవర్గ ఎన్నికలో భాగంగా మండల కన్వీనర్‌గా పెద్దపడిశాల గ్రామానికి చెందిన బందెల ప్రమోద్‌ని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ప్రమోద్ మాట్లాడుతూ తనపై ఉంచిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానని, నియామకానికి సహకరించిన పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో సీనియర్ నాయకులు నత్తి యాదగిరి మాదిగ, ఎర్ర నరేష్, నత్తి కిష్టయ్య, గడ్డం రాములు, బందెల సోమయ్య, మచ్చ యాదగిరి, అన్నెపర్తి వంశీ, ప్రవీణ్, గోపాల్ దాస్ మహేష్, చాగంటి సందీప్, అన్నెపర్తి సైదులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సభ్యత్వ బీమా చెక్కులు అందజేత



నవతెలంగాణ-వలిగొండరూరల్

నాగారం గ్రామానికి చెందిన బండ అంజయ్య, బండ జంగమ్మ దంపతులు ఇటీవల విద్యుత్ ఘాతానికి గురై మరణించడంతో బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ భీమా ద్వారా మంజూరైన రూ.2 లక్షలు ఇరువురి చెక్కులను భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి శనివారం వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మొగుళ్ళశ్రీనివాస్, పలుసం రమేష్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు తుమ్మల వెంకట్ రెడ్డి, వల్లమల్ల కృష్ణ, ఎల్లంకి స్వామి, సలీం, నాగార్జున, సత్తయ్య, కళ్లెం మారయ్య తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రవేశానికి దరఖాస్తులు

నవతెలంగాణ-సంస్థాన్‌నారాయణపురం

మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూల్)లో 6వ తరగతి ప్రవేశంకోసం దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఆశీర్వాదం తెలిపారు. 6వ తరగతిలో 100 సీట్లు, 7వ తరగతి నుంచి 10వ తరగతుల్లో ఖాళీ అయినా సీట్ల కోసం ఆసక్తిగా విద్యార్థులు ఫిబ్రవరి 22 నాటికి ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 7వ తేదీన రాత పరీక్షలు ఉంటాయన్నారు. ఆసక్తిగల విద్యార్థులు https://telangana.ms.cgg.gov.in వెబ్సైట్లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

అంగవైకల్యం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహనా కలిగి ఉండాలి

- జిల్లా సంక్షేమ అధికారిణి అన్నపూర్ణ

నవతెలంగాణ-భువనగిరి

సమాజంలో ప్రతి ఒక్కరూ అంగవైలక్యం పట్ల అవగాహనా కలిగి ఉండాలని ,వికలాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను వికలాంగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారిణి అన్నపూర్ణ అన్నారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక క్యాలెండర్‌ను శనివారం సమీకృత కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వికలాంగుల హక్కుల పరిరక్షణ కోసం అనేక



చట్టాలను అమలు చేస్తున్నాయన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో వికలాంగులకు 5శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నామన్నారు, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వికలాంగుల కోసం ఉన్న చట్టాలు, జీవో ల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సురుపంగా ప్రకాష్, జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్ మహిళా కన్వీనర్ కొత్త లలిత జిల్లా నాయకులు గోపి,కార్యాలయ సూపరింటెండెంట్ శశికళ ,వెంకటేశ్వర్లు, కిరణ్ మంజుల,కార్యాలయ సిబ్బంది మరియు వికలాంగులు పాల్గొన్నారు.

కృతజ్ఞత సభను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-వలిగొండ

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పట్టణంలో ఆదివారం జరగబోయే తెలంగాణ ఉద్యమకారుల ఫోరం భువనగిరి పార్లమెంటు నియోజకవర్గం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞత సభను విజయవంతం చేయాలని సీనియర్ నాయకులు వలిగొండ మాజీ సర్పంచ్ పబ్బు ఉపేందర్‌బోస్, ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి నల్లగొండజిల్లా అధ్యక్షులు సంగిశెట్టి క్రిస్టఫర్ తెలిపారు. విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనేక మంది ఉద్యమకారులు త్యాగాలు చేసి కేసులపాలై



జైలు జీవితాలను గడిపిన ఉద్యమకారులు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బలిదానాలు చేసిన అమరుల కుటుంబాలను గత ప్రభుత్వం గుర్తించలేదన్నారు. ఈ సమావేశంలో ఉద్యమకారులు మండల అధ్యక్ష కార్యదర్శులు మారగోని శ్రీనివాస్‌గౌడ్, బోడిగే సుదర్శన్, చిలుగూరి సత్తిరెడ్డి, కొండూరు సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికకు ప్రభుత్వ షెడ్యూలు విడుదల

నవతెలంగాణ-ఆలేరుటౌన్

పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికకు ప్రభుత్వం షెడ్యూలు విడుదల చేసిందని మండల విద్యాధికారి జె కృష్ణ, ఆలేరు పట్టణంలో శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29 నుండి అన్ని రకాల ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించాలని తెలిపారు. 2009 విద్యా హక్కు చట్టం ప్రకారం 1 నుండి 8 వ తరగతి వరకు స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ లు నియమించాలని సూచించారు. 20న అన్ని పాఠశాలల్లో ఎన్నికల నోటీస్ విడుదల చేయడంతో పాటు ఓటరు లిస్ట్ కూడా ప్రదర్శించారు. జాబితాపై అభ్యంతరాలను 22 జనవరి 2024 సాయంత్రం 4 గంటల వరకు స్వీకరిస్తారు.తుది జాబితాను 24 జనవరి 2024 ఉదయం 11 గంటలకు ప్రతి స్కూల్ నోటీస్ బోర్డ్ పై ఉంచుతారని చెప్పారు. 29నఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్నికలు నిర్వహిస్తారని వివరించారు.

పట్టభద్రులందరూ విధిగా తమ ఓటు నమోదు చేసుకోవాలి

- డీఏఓ రాధ

నవతెలంగాణ-మిర్యాలగూడ



నల్గొండ,వరంగల్,ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలోని పట్టభద్రులందరూ విదిగా తప్పకుండా తమ ఓటు నమోదు చేసుకోవాలని రెవిన్యూ డివిజన్ కార్యాలయ పరిపాలన అధికారి, ఓటు నమోదు డిజిగ్నేటెడ్ అధికారి రాధ కోరారు. శనివారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆర్డీవో కార్యాలయంలో ఓటు దరఖాస్తు ఫారాలను సమర్పించారు. ఈ సందర్భంగా కార్యాలయ పరిపాలన అధికారి రాధ మాట్లాడుతూ సెప్టెంబర్ 1, 2020 వరకు ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణతైన వారు ఓటు నమోదు చేసుకునేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందన్నారు. గతంలో పట్టభద్రుల ఎన్నికల్లో ఓటరుగా నమోదై ఓటు హక్కు వినియోగించుకున్న, అర్హత కలిగిన వారందరూ తిరిగి ఫిబ్రవరి 6లోగా ఆన్‌లైన్‌లోగాని ఆఫ్‌లైన్‌లోగాని ఫారం- 18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని లింగంగౌడ్ అర్హులైన పట్టభద్రులని కోరారు.

ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-యాదగిరిగుట్టరూరల్



యాదగిరిగుట్ట మున్సిపాలిటీ 3వ వార్డు శనివారం, ఇటీవల అనారోగ్యం కారణంగా సయ్యద్ ఫారుక్ భార్య సయ్యద్ షరిఫ బి మృతి చెందింది. మృతురాలి కుటుంబాన్ని శనివారం బీఆర్ఎస్ పట్టణ సెక్రెటరీ జనరల్ పాపట్ల నరహరి పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా యూత్ అధ్యక్షులు ఆకుల శ్రీనివాస్ యాదవ్, గౌటి సదానందం, మోత్కుపల్లి బిక్షపతి, మోత్కుపల్లి భాస్కర్, బూడిద వెంకటేష్, బూడిద రాజు, పులిగిల్ల గిరి, షేక్ నజీర్, సయ్యద్ హైమద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కాంగ్రెస్ ఎస్సీ విభాగం వైస్ చైర్మెన్‌గా సురేష్



నవతెలంగాణ-భువనగిరి

భువనగిరి పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తొర్రి సురేష్‌ను శనివారంకాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం జిల్లా వైస్ చైర్మెన్‌గా నియమిస్తూ జిల్లా అధ్యక్షులు దర్గాయి హరిప్రసాద్ నియామక పత్రం అందజేశారు. 20 ఏండ్ల నుంచి కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం చేస్తున్న కృషిని గుర్తించి అధిష్టానం ఆదేశానుసారం ఈ నియామకం చేపట్టినట్లు తెలిపారు ఈ సందర్భంగా తొలి సురేష్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం అధ్యక్షులు నాగరి గారి ప్రీతంకి, జిల్లా అధ్యక్షులు దర్గాయి హరిప్రసాద, జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ,ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కి డిసిసి అధ్యక్షులు అండెం సంజీవరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ నాయకులు ఏగూరి ఉదయ్ కుమార్, పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పోకల యాదగిరి, నాయకులు మహంకాళి సురేష్, రెంటాల ప్రవీణ్, పోకల సాయికుమార్, వాకిటి కుమార్, కొంగరి మహేష్, తొర్రి అనిల్ పాల్గొన్నారు.

క్రిమినల్ కేసులు పట్ల జాప్యం చేయొద్దు

నవతెలంగాణ-భువనగిరి




వివిధ క్రిమినల్ కేసుల పరిష్కారంలో జాప్యం చేయొద్దని , అర్హులైన వారికి అందచేసే న్యాయ సహాయం, చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు అన్నారు. శనివారం కోర్టు ఆవరణలో జిల్లా సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో న్యాయమూర్తి వివిధ క్రిమినల్ కేసుల పరిష్కారం, జాప్యం జరుగకుండా తీసుకోవాల్సిన చర్యలు, అర్హులైన వారికి అందచేసే న్యాయ సహాయం, ఖైదీల క్రిమినల్ కేసులపై పునః సమీక్ష నిర్వహించారు. న్యాయమూర్తులకు, పోలీసు అధికారులకు, సబ్ జైలు పర్యవేక్షణాధికారికి పలు సూచనలు చేశారు.. మార్చి 9వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ ఆదాలత్ లో రాజీ పడదగు కేసుల పరిష్కారానికి కార్యాచరణ చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కె. మారుతి దేవి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె. దశరథ రామయ్య, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి డి. నాగేశ్వర్ రావు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి. కవిత, డి సి పి క్రైం బ్రాంచ్ అరవింద్ బాబు, భువనగిరి ఎ. సి. పి. వెంకట్ రెడ్డి, భువనగిరి సబ్ జైలు పర్యవేక్షణాధికారి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మెన్, వైస్ చైర్మెన్ రాజీనామా

నవతెలంగాణ-భువనగిరి

భువనగిరి మున్సిపల్ చైర్మెన్ ఎనబోయిన ఆంజనేయులు, వైస్ చైర్మెన్ చింతల కృష్ణయ్యలు శనివారం రాజీనామాలు మున్సిపల్ కమిషనర్‌కు అందజేశారు. రాజీనామా చేస్తారని మూడు రోజుల ముందు నుండి చేరుకుంటున్న ఊగిసలాట జరిగి ఎటికేలకు తమ రాజీనామా పత్రాలను అందజేశారు. వారు రాజీనామా పత్రంలో తమ వ్యక్తిగత కారణాలవల్ల రాజీనామా చేస్తున్నట్లు వాటిన ఆమోదించాలని విద్యార్థి చేశారు. చైర్మన్ తో పాటు పట్టణ అధ్యక్షులు ఏవి కిరణ్ కుమార్ పాల్గొన్నారు.



టూర్‌లో కౌన్సిలర్లు...

ఈనెల 23న ప్రస్తుత చైర్మెన్ ఎనబోయిన ఆంజనేయులు వైస్ చైర్మెన్ చింతల కిష్టయ్యలపై అవిశ్వాస తీర్మానంపై సమావేశం ఉన్న సందర్భంగా భువనగిరి మున్సిపాలిటీకి చెందిన కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలకు కౌన్సిలర్లు వేరువేరుగా టూర్లకు వెళ్లారు. అవిశ్వాసం రోజు రావడానికి రెండు రోజుల ముందే చైర్మెన్ వైస్‌చైర్మెన్లు రాజీనామా చేశారు.టూర్‌లో ఉన్న కౌన్సిలర్ ఎత్తులను చిత్తు చేయడానికి ఈ రాజీనామాలు చేసినట్లు సమాచారం.

క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-రాజపేట

యాదగిరిగుట్టలోని గౌడ ఫంక్షన్ హాల్‌లో శనివారం పెరిక కుల సంఘం క్యాలెండర్‌ను రాష్ట్ర పెరిక నాయకులు దాసరి మల్లేశం, యాదాద్రి టౌన్, ట్రాఫిక్ సిఐ లు లింగం,రమేష్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షులు మడిశెట్టి సత్యనారాయణ , జిల్లా ప్రధాన కార్యదర్శి కొమిరిశెట్టి నర్సింహులు ఈ సభకు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ బొట్టు అబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి

నవతెలంగాణ-భూదాన్‌పోచంపల్లి

మున్సిపల్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఏరియల్ వెంటనే చెల్లించాలని సీఐటీయూ మండల కన్వీనర్ మంచాల మధు కోరారు. శనివారం మూడవరోజు జరుగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడుతూ ప్రభుత్వ అధికారంలో ఉన్నప్పుడు 30శాతం పిఆర్సి జీవో ఇవ్వడంతో కార్మికులకు వేతనాల పెంచడం , పెండింగ్ ఏరియల్స్ వెంటనే చెల్లించాలని మున్సిపల్ చైర్మెన్‌తో మాట్లాడగా రెండు నెలల్లో చెల్లిస్తామని హమీనిచ్చారని తెలిపారు. కానీ ఇప్పటి వరకు చెల్లంచలేదన్నారు. వెంటనే బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాలయ్య ముత్తమ్మ నరేష్ నిర్మల శేఖర్ నరసింహ సబితా లింగయ్య లక్ష్మమ్మ మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

4

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

నల్లగొండ, సూర్యాపేట
యాదాద్రిభువనగిరి

ఆదివారం | జనవరి 21. 2024 | www.navatelangana.com

ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ-రామన్నపేట

మండలంలోని వెల్లంకి గ్రామంలో అనారోగ్యంతో పోలగోని సాయిలు(70) మృతి చెందడంతో గ్రామ సర్పంచ్ ఎడ్ల మహేందర్ రెడ్డి సమకూర్చిన 5000 రూపాయల ఆర్థిక సహాయాన్ని ఎడ్ల సుదర్శన్ రెడ్డి శనివారం కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు వున్న వెంకటేశం, ఎడ్ల నరేందర్ రెడ్డి, ఎడ్ల కృష్ణారెడ్డి, కర్రె రమేష్, పినికేసి గోపాల్ రెడ్డి, కరకంటి శ్రీశైలం, బుడ్డా బిక్షం,తాటిపాముల లింగస్వామి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

భారత్ జూడో నయా యాత్ర వాహనాలపై బీజేపీ గుండాల దాడి

నవతెలంగాణ-దేవరకొండ

అస్సాంలోని లఖింపూర్‌లో భారత్ జూడో నయాయాత్ర వాహనాలపై బీజేపీ గూండాలు దాడి చేయడం సిగ్గుచేటని దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్రా రామ్‌సింగ్ శనివారం తెలిపారు. కాంగ్రెస్ బ్యానర్లు, పోస్టర్లను చింపివేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. గత 10 సంవత్సరాలలో, భారత ప్రజలకు రాజ్యాంగం హామీ ఇచ్చిన ప్రతి హక్కును మరియు న్యాయాన్ని తుంగలో తొక్కి, కూల్చివేసేందుకు బీజేపీ ప్రయత్నించిందన్నారు. ప్రశ్నించే గొంతులను లొంగదీసుకోవాలని, తద్వారా ప్రజాస్వామ్యాన్ని హైజాక్ చేయాలని చూస్తుందన్నారు.ఇటువంటి దాడులకు కాంగ్రెస్ భయపడదని హెచ్చరించారు.

కాల్వ ఇలా.. నీరు పారేదెలా..!

- **లక్ష్మాపురం కాల్వనిండా గుర్రపు డెక్క ఆకే**

నవతెలంగాణ-రామన్నపేట

కాల్వలు సమృద్ధిగా సాగునీరు అందించాలి... కాల్వ చివరి ఆయకట్టు వరకుగల పంట పొలాలకు సాగునీరు చేరాలి... అప్పుడే సాగునీటి కాల్వ లక్ష్యం నెరవేరుతుంది... రైతుల సాగునీటి కష్టాలు తీరుతాయి.. పంటలు సమృద్ధిగా పండి సన్న, చిన్న కారు రైతులు ఆర్థిక అభివృద్ధిని సాధిస్తారు. మండలంలోని శోభనాద్రిపురం గ్రామంలోని మూసి నది కత్వ నుండి ప్రారంభమైన లక్ష్మాపురం ఏటికాల్వ ఐదు కిలోమీటర్లు పారుతూ మండలంలోని మునిపంపుల గ్రామ చెరువుకు చేరుతుంది. నిజాం కాలంలో నిర్మించిన ఈ కాల్వ మధ్యలో ఉన్న కుంటలను నింపుతూ, కొన్ని తూముల గుండా శోభనాద్రిపురం, లక్ష్మాపురం, మునిపంపుల గ్రామాల్లోని సుమారు ఎనిమిది వందల ఎకరాలకు సాగునీరు అందిస్తుంది. ఎంతో ప్రాముఖ్యత ఉన్న ఈ కాల్వ ప్రస్తుతం పూర్తిగా గుర్రపు డెక్క ఆకుతో నిండిపోయి ఉంది. సాగునీరు వారే పరిస్థితి లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడక తప్పడం లేదు. ఈ కాల్వ కింద సన్న చిన్న కారు రైతులే ఉండడంతో కాల్వలోని గుర్రపు డెక్క ఆకును తొలగించే ఆర్థిక పరిస్థితులు లేకపోవడంతో సతమతమవుతున్నారు. నీటిపారుదల శాఖ అధికారులు సత్వరమే చర్యలు తీసుకొని గుర్రపు డెక్క ఆకును పూర్తిగా తొలగించి సమృద్ధిగా సాగునీరు అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.



15 రోజులలో గుర్రపు డెక్క ఆకును తొలగిస్తాం

నీటిపారుదల శాఖ ఈఈ బొడ్డు సురేందర్ రావు

రానున్న 10, 15 రోజులలో లక్ష్మాపురం ఏటి కాల్వలో పేరుకుపోయిన గుర్రపు డెక్క ఆకును పూర్తిగా తొలగించి సాగునీరు ఎలాంటి ఇబ్బంది లేకుండా పారే విధంగా చూస్తాం.. లక్ష్మాపురం ఏటి కాల్వలోనే కాకుండా మండలంలో ఉన్న మిగతా అన్ని కాల్వల్లో చెత్తను, గుర్రపు డెక్క ఆకును తొలగిస్తాం.. ఒకటి రెండు రోజుల్లో స్థానిక నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి మండలంలోని సాగునీటి కాల్వలన్నింటిని పరిశీలిస్తాం.

పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

నవతెలంగాణ-తిరుమలగిరి

రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల యజమాన్యాల కమిటీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన సందర్భంగా ప్రాథమిక పాఠశాల వెలిశాలలో నోటీస్ బోర్డుపై ఎన్నికల నోటిఫికేషన్ అంటించారు.అదేవిధంగా గ్రామపంచాయతీ వెలిశాల నోటీసు బోర్డుపై ఎన్నికల నోటిఫికేషన్ జీవో,యాజమాన్య కమిటీ ఎన్నికల నోటిఫికేషన్ అదే విధంగా పాఠశాల ఎన్నికల ఓటర్స్ జాబితాను నోటీస్ బోర్డ్‌పై అంటించారు.ఈ సందర్భంగా పాఠశాల యజమాన్య కమిటీ ఎన్నికల నోటిఫికేషన్ గురించి పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌కు వచ్చిన తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.ఒకే పాఠశాలలో ఒక తండ్రి యొక్క ఇద్దరు పిల్లలు వేరువేరు తరగతులలో విద్యనభ్యసించేటప్పుడు ఆ తల్లిదండ్రుల ఇద్దరికి ఓటు హక్కు ఉంటుంది. కానీ ఇద్దరు పిల్లలు ఒకే తరగతిలో చదువుతున్నప్పుడు ఒక్కరికి మాత్రమే ఉంటుంది.ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుండి ఐదు తరగతులు విద్యార్థుల తల్లిదండ్రులకు ఓటు హక్కు ఉంటుంది. అదేవిధంగా 6 నుండి 8వ తరగతి వరకు చదువుతున్న వారికి ఓటు హక్కు ఉంటుందని, ఈవిషయాన్ని తల్లిదండ్రులు గుర్తించాలన్నారు.ఈ సమావేశంలో ఉమ్మడి పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జి.అశోక్‌రెడ్డి, సీహెచ్.సోమయ్య, జి.శ్రావణ్‌కుమార్, మల్లయ్య దస్తగిరి, రామాంజనేయులు,ఎస్‌కె.ఖాదర్‌పాషా, నగేశ్, ఉపేందర్, సంతోష్ పాల్గొన్నారు.





ఎస్‌పీఆర్ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-నకిరేకల్

నేషనల్ సైన్స్ ఒలంపియాడ్, ఇంటర్నేషనల్ మ్యాథమెటిక్స్ ఒలంపియాడ్ పరీక్షలలో నకిరేకల్ ఎస్‌పీఆర్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారని పాఠశాల కరస్పాండెంట్ బి. కన్నయ్య గౌడ్ తెలిపారు. ఢిల్లీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పరీక్షలో 17 మంది విద్యార్థులు గోల్డ్ మెడల్స్ సాధించి ఫైనల్ లెవల్‌కు అర్హత సాధించారన్నారు. అదేవిధంగా మరో 40 మంది విద్యార్థులు సర్టిఫికెట్స్, షీల్డులు సాధించారని తెలిపారు. పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల చైర్మెన్ అలుగుబెల్లి కరుణాకర్ రెడ్డి, పాఠశాల విజినరీ శ్రీపతి రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ సుందరి శివరామకృష్ణతోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.



జాతీయ బాలిక దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-మర్రిగూడ

మండలంలోని కొట్టాల, బట్లపల్లి, మర్రిగూడ గ్రామాల అంగన్వాడీ కేంద్రాలలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జాతీయ బాలిక దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సూపర్వైజర్స్ యశోద, పద్మ హాజరై మాట్లాడుతూ మహిళా సాధికారత, లింగ వివక్ష, లింగ నిష్పత్తి, భ్రూణహత్యలు, బాల్య వివాహాలు, ఆడపిల్లల రక్షణ, చదువు పౌష్టికాహారం, తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణీ స్త్రీలకు సీమంతాల కార్యక్రమం నిర్వహించారు. జనవరి 24 వరకు మండలంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలలో జాతీయ బాలిక దినోత్సవ వేడుకలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కవిత, పంచాయతీ కార్యదర్శి వెంకన్న, విలేజ్ డాక్టర్ ప్రశాంతి, ఉపాధ్యాయురాలు సునీత, రజిత, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.



డ్రైయినేజీ మరమ్మతులు చేపట్టిన కౌన్సిలర్

నవతెలంగాణ-నాగార్జునసాగర్

నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని మూడవ వార్డులో డ్రయినేజీలోని మురికి నీరు రోడ్లపై పొంగిపొర్లుతూ దుర్వాసనను వెదజల్లుతుంది.ఈ విషయం తెలుసుకున్న ఆ వార్డు కౌన్సిలర్ శిరీష మోహన్‌నాయక్ శనివారం మున్సిపాలిటీ సిబ్బందితో కలిసి డ్రయినేజీలో పేరుకుపోయిన చెత్తను తొలగించి మరమ్మతులు చేపట్టిననంతరం పైన మూతను ఏర్పాటు చేశారు.విషయం తెలుసుకున్న గంటల వ్యవధిలోనే కౌన్సిలర్ స్పందించి డ్రయినేజీ మరమ్మతులు చేపట్టడం పట్ల స్థానికులు ప్రశంసలు కురిపిస్తున్నారు.ఈ కార్యక్రమంలో పారిశుధ్య సిబ్బంది, వార్డ్ ఆఫీసర్ నిరంజన్,వెంకటిరెడ్డి పాల్గొన్నారు.

నేడు నాంపల్లి సబ్ స్టేషన్ పరిధిలో కరెంటు నిలిపివేత

నవతెలంగాణ-నాంపల్లి

నేడు నాంపల్లి సబ్ స్టేషన్‌పరిధిలోని గ్రామాలలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు సబ్ స్టేషన్‌లో నిర్వహణ పనులు చేయాలిసి ఉన్నందున విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగ దారులు సహకరించాలని ఎలక్ట్రిసిటీ ఏఈ శివప్రసాద్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు.

దస్తావేజులు పోయినవి

నేను అనగా దుర్బ రాధిక భర్త. ఇసుకపల్లి మోహన్ కుమార్. ఎస్‌బి హెచ్ కాలనీ, ఎల్బీనగర్, జిల్లా రంగారెడ్డి. సంక్రాంతి పండుగకు వచ్చి వెళ్తుండగా చిట్యాల బస్ స్టేషన్‌లో కవర్ పోయింది. అందులో.సిరి లక్ష్మీ ఎన్ క్లైవ్ సంతోష్ నగర్ చిట్యాల. ఇంటి దస్తావేజులు ఉన్నవి.(డాక్యుమెంటరీ నెంబర్. 9217/2016).

దొరికిన వారు కింది నెంబర్‌కు తెలియజేయగలరు.9246335085

గణతంత్ర దినోత్సవానికి

అన్ని ఏర్పాట్లు చేయాలి

- **స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**



నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

జనవరి 26న నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవాన్ని జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపైఅదనపు కలెక్టర్(రెవెన్యూ) జె.శ్రీనివాస్‌తో కలిసి అన్ని శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 26న జిల్లా కేంద్రంలో పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ ఏర్పాట్ల కోసం ముందుగానే ఆయా శాఖల అధికారులు సమీక్షించుకోని ఏర్పాట్లు చేయాలని అన్నారు.సీటింగ్,వేదిక ఏర్పాట్లు చేయాలని అర్డిఓ ను ఆదేశించారు. పరేడ్ మైదానంలో పారిశుధ్య ఏర్పాట్లు, మంచినీరు సరఫరా ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు.విద్యార్థులచే జాతీయ సమగ్రత,దేశ భక్తిని చాటేలా సాంస్కృతిక కార్య క్రమాలు ఏర్పాటు చేయాలని జిల్లా విద్యా శాఖ అధికారిని ఆదేశించారు. ముఖ్య అతిథి సందేశం ను రూపొందించాలని సిపిఓను ఆదేశించారు. మెడికల్ క్యాంప్,108 వాహనం ఏర్పాటు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని, అగ్ని మాపక వాహనం ఏర్పాటు చేయాలని అగ్ని మాపక శాఖ అధికారిని ఆయన ఆదేశించారు. పోలీస్ శాఖ చే గౌరవ వందనం, బందొ బస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు అభివృద్ధిని వివరిస్తూ వివిధ శాఖలు, శకటాలు స్టాళ్లను ఏర్పాటు చేయాలని, కార్యక్రమాలన్ని ప్రణాళిక బద్దంగా జరిగేలా చూసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అర్డిఓ రవి, జడ్పి సిఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి,డిఆర్డిఓ కాలిందిని, సిపిఓ బాల శౌరి, డిఈఓ బిక్ష పతి, జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశ్వర్లు,పౌర సరఫరాల డియం నాగేశ్వర రావు, ఎస్సి కార్పొరేషన్ ఈడి శ్రీనివాస్ డిడబ్ల్యుఓ కృష్ణ వేణి, డిపిఆర్ఓ శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష

నవతెలంగాణ-పెద్దవూర

మండలంలోని చలకుర్తి జవహర్ నవోదయ విద్యాలయంలో 2024%-25 విద్యాసంవత్సరంలో ఆరోతరగతిలో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష శనివారం ప్రశాంతంగా ముగిసిందని ప్రిన్సిపాల్ నాగభూషణం తెలిపారు.శనివారం ఆయన విలేకరులతో లమాట్లాడారు. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష నిర్వహించామన్నారు.ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా 4623 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 3380 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. ఆరోతరగతిలో 80 సీట్లు భర్తీకిగాను నల్గొండ జిల్లాలో 2254మందికి 1657 మంది పరీక్ష కు హాజరుకాగా 597 మంది ఆబ్సెంట్ అయ్యారు. సూర్యాపేట జిల్లా లో 1564 మందికి 1186 మంది హాజరు కాగా 378మంది, యదాద్రి భువనగిరి జిల్లాలో 805 మందికి 537మంది హాజరు కాగా 268 మంది విద్యార్థులు హాజరుకాలేదన్నారు.మొత్తం 4623 మందికి గాను 3380 మంది విద్యార్థులు హాజరుకాగా 1243మంది ఆబ్సెంట్ అయ్యారని తెలిపారు.విద్యార్థుల ప్రతిభ, రిజర్వేషన్ల ప్రాతిపదికన సీట్లను కేటాయించనున్నామని తెలిపారు, నవోదయలో సీటు ఇప్పిస్తామంటూ వచ్చే దళారుల మాట నమ్మి మోసపోవద్దన్నారు.



పట్టభద్రులందరూ ఓటు నమోదు చేసుకోవాలి

నవతెలంగాణ-మిర్యాలగూడ

నల్గొండ,వరంగల్,ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలోని పట్టభద్రులందరూ విధిగా తప్పకుండా తమ ఓటు నమోదు చేసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ కోరారు.శనివారం ఆర్డీవో కార్యాలయంలో ఓటు దరఖాస్తు ఫారాలను ఆర్డీవో కార్యాలయంలో సమర్పించి మాట్లాడారు.సెప్టెంబర్ 1, 2020 వరకు ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన వారు ఓటు నమోదు చేసుకునేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందన్నారు.గతంలో పట్టభద్రుల ఎన్నికల్లో ఓటరుగా నమోదై ఓటు హక్కు వినియోగించుకున్నప్పటికీ ఇప్పుడు ఆ ఓటరు జాబితా చెల్లదన్నారు.అర్హత కలిగిన వారందరూ ఫిబ్రవరి 6వ తేదీలోగా ఆన్లైన్లో గాని,ఆఫ్‌లైన్‌లోగానీ ఫారం- 18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.



శంకర్ మృతి డీవైఎఫ్ఐకి తీరనిలోటు

నవతెలంగాణ-మునగాల

మండలపరిధి.లోని నర్సింహులగూడెం గ్రామానికి చెందిన డీవైఎఫ్ఐ నాయకులు పిడమర్తి శంకర్ ఆకాల మరణం సీపీఐ(ఎం)కు తీరనిలోటని ఆ పార్టీ మండల కమిటీ సభ్యులు, గ్రామ మాజీ సర్పంచ్ జూలకంటి కొండారెడ్డి అన్నారు .శనివారం నర్సింహులగూడెంలో మృతుని బౌతికాయాన్ని సందర్శించి ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని పనిచేస్తున్న శంకర్ మరణం మరింత బాధాకరమన్నారు.ఆయన మరణం పార్టీకి తీరని లోటని ఆవేదన వ్యక్తంచేశారు.శంకర్ నిరుపేద కుటుంబంలో పుట్టినప్పటికి పార్టీ కార్యక్రమాల్లో చాలా నిబద్ధతతో పనిచేశారని కొనియాడారు.శత్రువర్గాలు అతనిపై ఎన్నికేసులు బనాయించినా, కుటుంబ ఇబ్బందులు ఉన్నప్పటికీ పార్టీ కోసం నిరంతరం శ్రమించారని తెలిపారు.శంకర్ కుటుంబానికి పార్టీ గ్రామ శాఖ అన్ని విధాలుగా అండగా వుంటుందని హామీ ఇచ్చారు.మృతుని భౌతికాయాన్ని సందర్శించిన వారిలో శాఖా కార్యదర్శులు నందిపాటి శ్రీరాములు, మారం ఉదయమ్మ, మారం వెంకటరెడ్డి, నాయకులు జూలకంటి విజయలక్ష్మి, కాంపాటి అచ్చయ్య, ఉబ్బపెల్లి సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, పోకలవెంకన్న, సోమపంగురమేష్ ఉన్నారు.




డెక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసిన

వైద్య శిబిరానికి విశేషస్పందన

నవతెలంగాణ-పాలకవీడు

మండలంలోని భవానిపురం డెక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీ యజమాన్యం శనివారం ఏర్పాటు చేసిన వైద్య శిరానికి సమీప గ్రామాల ప్రజల నుండి విశేష స్పందన లభించింది.మ్యాక్స్ కేర్ హాస్పిటల్ మిర్యాలగూడ వారిచే సేవలో అందించిన శిబిరాన్ని సంస్థ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరాజు, జీఎం నాగమల్లేశ్వరరావు ప్రారంభించారు. పాఠశాల ఆడిటోరియంలో వైద్య పరీక్షల కోసం వచ్చిన ప్రజలకు అన్ని సౌకర్యాలను సంస్థ ఏర్పాటు చేసింది.మంచినీరు భోజన వసతి, రవాణా సౌకర్యం కల్పించారు. ఎముకలు, స్త్రీల గర్భకోశ వ్యాధులు, చిన్నపిల్లల వ్యాధులు , ఇతర సాధారణ ఆరోగ్య సమస్యలకు పరీక్షలు జరిపి వైద్యులచే మందులు అందజేయడంతో పాటు, ఆరోగ్య సలహాలు సూచనలను ఇచ్చారు. సమీప గ్రామాలైన శూన్య పహాడ్, మహంకాళి గూడెం, రావిపాడు, చెరువు తండా, దేవుల తండా, కొత్త తండా, జాన పహాడ్ తదితర గ్రామాల నుండి 380 మందికి పైగా ఈ శిబిరానికి వచ్చారు. డాక్టర్ నవీన్‌కుమార్, మౌనికల బృందంచే వైద్య సేవలు ఇప్పించినందుకు సిమెంట్ పరిశ్రమ యాజమాన్యానికి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



అభివృద్ధి పనులకు యాక్షన్‌ప్లాన్

నవతెలంగాణ-మునగాల

గ్రామంలో అభివృద్ధి పనులను చేపట్టే విధంగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నట్లు మునగాల సర్పంచ్ చింతకాయల ఉపేందర్, పంచాయతీ కార్యదర్శి కొల్లు శ్వేత తెలిపారు.రాబోయే ఆర్థిక సంవ త్సరంలో చేపట్టే అభివృద్ధి పనుల కోసం శనివారం పంచాయతీ కార్యాల యంలో గ్రామసభ నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024-25లో15 ఫైనాన్స్ నిధుల మంజూరు కోసం గ్రామంలో ముందస్తుగా ప నులను గుర్తించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.గ్రామంలో మౌలిక వసతులు, డ్రయినేజీ, తాగునీరు, పారిశుధ్యం పనులను గుర్తించి వాటికి ప్రాధాన్యత ఇస్తామన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కొల్లు శ్వేత, సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు దేవరం వెంకటిరెడ్డి,ఏపీఎం నగేశ్, ఉపసర్పంచ్ ఎల్.వెంకయ్యఫీల్డ్అసిస్టెంట్ నారగాని కృష్ణవేణి,వార్డు సభ్యులు పాల్గొన్నారు.



ప్రజాసమస్యలు పరిగణలోకి తీసుకొని అనుమతులు ఇవ్వాలని వినతి

నవతెలంగాణ-హుజూర్‌నగర్

ప్రజల సమస్యలను పరిగణలోకి తీసుకొని పరిశ్రమలకు అనుమతులు ఇవ్వాలని వరల్డ్ హ్యూమన్ రైట్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు దారా మనోహర్ శనివారం ఆర్డీఓజగదీశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గపరిధిలోని మేళ్లచెర్వు మండలం రామాపురం గ్రామంలో శనివారం జరిగిన రైన్‌సిమెంట్ ప్రజాప్రతిశాఖలో ఆయన పాల్గొన్న తదుపరి ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు.సిమెంట్ పరిశ్రమలకు అనుమతులు ఇచ్చే సందర్భంలో కాలుష్యం వాటి వలన ఏర్పడే ధూళి,సాంద్రత,నీటి కాలుష్యం, పరిసర ప్రాంతాల గ్రామాల ప్రజల ఆరోగ్యాలను పరిగణలోకి తీసుకోవాలన్నారు.ఇవన్నీ పరిగణలోకి తీసుకొని అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.



ఉమ్మడి జిల్లా ప్రయివేటు కళాశాలల యాజమాన్య సంఘం పధాన కార్యదర్శిగా మల్లేశం

నవతెలంగాణ-భువనగిరి

భువనగిరి పట్టణానికి చెందిన శ్రీ వైష్ణవి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మధిర మల్లేశంను నల్లగొండలో జరిగిన ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశంలో తెలంగాణ ప్రయివేటు జూనియర్ కళాశాలల యాజమాన్యం సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇంత పెద్ద బాధ్యతను అప్పగించిన ప్రయివేటు జూనియర్ కళాశాలల యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రైవేటు కళాశాలల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లేందుకు కృషి చేస్తానని, సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు నిరంతరం పోరాటం చేసి ప్రభుత్వం నుండి వచ్చే నిధులను వచ్చే విధంగా కృషి చేస్తానని తెలిపారు. వారిని పలువురు ప్రవేట్ జూనియర్ కళాశాల యాజమాన్యలు మరియు విద్యార్థి సంఘ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.



శాంతినికేతన్‌లో సంగీతంతో కూడిన వ్యాయామం

నవతెలంగాణ-పెద్దవూర

మండలంలోని శాంతినికేతన్ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రిన్సిపాల్ నడ్డి ఆంజనేయులు ఆధ్వర్యంలో సంగీతంతో కూడిన వ్యాయామం విద్యార్థులకు నేర్పుతున్నారుసంగీతం ఎప్పుడూ వ్యాయామంతో ముడిపడి ఉంటుంది. మనలో చాలా మంది పార్క్‌లో జాగింగ్ చేస్తున్నప్పుడు లేదా జిమ్‌లో వర్కౌట్ చేస్తున్నప్పుడు మనకు ఇష్టమైన సంగీతాన్ని వింటాముకానీ అది మన వ్యాయామ దినచర్యకు తోడుగా మాత్రమే కాకుండా ఎప్పుడూ ఆలోచించడం లేదన్నారు. కానీ ఇటీవల శాస్త్రీయ పరిశోధనలు వ్యాయామం చేస్తున్నప్పుడు 'సరైన' సంగీతాన్ని ఉపయోగించడం వల్ల మీకు చాలా మంచి జరుగుతుందనే వాస్తవాన్ని వెలుగులోకి తెచ్చిందన్నారు.దీనిని దృష్టిలో పెట్టుకొని విద్యార్థులకు ప్రతి మూడవ శనివారం మ్యూజికల్ వ్యాయామం నేర్పిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమీజ, వెంకన్న శ్రీ లక్ష్మి, శంకర్, రాణి, అనిత, మౌనిక, శివలీల, సంధ్య, లావణ్య, శిరీష పుష్ప, లలిత, అపర్ణ, వెంకటేశ్వర్లు, కృష్ణయ్య రమేష్, రాంరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు కేంద్రాలను పరిశీలించిన ఆర్డీవో శ్రీరాములు

నవతెలంగాణ-గుడిపల్లి

నూతనంగా ఏర్పాటైన గుడిపల్లి మండలకేంద్రంలోని 257 208 పోలింగ్ బూత్‌లలో ఏర్పాటుచేసిన ఓటర్ నమోదు కేంద్రాలని దేవరకొండ ఆర్డీఓ శ్రీరాములు తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు ను నమోదు చేసుకోవాలన్నారు.ఈరోజు రేపు చివరి అవకాశం ఉన్నందున యువతీ యువకులు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు అర్వపల్లి నర్సింహ,తహసీల్దార్ ప్రశాంత్,పంచాయతీ కార్యదర్శి నవీన్,బూత్ లెవెల్ ఆఫీసర్లు జయంతి, అలివేలు, గోలి రవి, నాగరాజు పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ, సూర్యాపేట
యాదాద్రిభువనగిరి
ఆదివారం | జనవరి 21. 2024 | www.navatelangana.com

ఓటరు నమోదు కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

నవతెలంగాణ-బీబీనగర్

మండల కేంద్రంలోని ఓటర్ నమోదు కేంద్రాలను శనివారం జిల్లా కలెక్టర్ హనుమంతు కె. జెండగే పరిశీలించినారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ శని, ఆదివారాల్లో మండల కేంద్రంలో 139, 140, 141, పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటర్ నమోదు క్యాంపులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున 18 సంవత్సరాలు నిండిన యువత తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని



ఇందు కొరకు ఫామ్ 6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. జనవరి 25వ తేదీన జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా క్షేత్రస్థాయిలో ఓటర్ నమోదు కార్యక్రమం నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ శ్రీధర్, బూత్ లెవల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై స్పెషల్ డ్రైవ్

నవతెలంగాణ-మర్రిగూడ

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం మండలంలోని ఆయా గ్రామాలలో తహసీల్దార్ బక్క శ్రీనివాసులు,ఎంపీడీవో జే వేంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామాలలోని బూత్ స్థాయి ఆఫీసర్ల (బీఎల్ఓ)లతో ఓటరు నమోదు పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.ఓటరు నమోదు,జాబితాలో సవరణలు, మార్పులు, చేర్పులు, తొలగింపు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.శనివారం 21 పామ్స్ నమోదు అయ్యాయని,ఓటరు నమోదుకు నేడు చివరి తేదీ కావడంతో 18ఏండ్లు నిండిన యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఓటరు నమోదు,సవరణకు అవసరమైన (6,8)పామ్స్ గ్రామాలలోని బీఎల్ ఓ ల వద్ద లభిస్తాయనితెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ బషీర్,ఆయా గ్రామాల బూత్ స్థాయి ఆఫీసర్లు పాల్గొన్నారు.



అర్హులైన వారంతా ఓటరుగా నమోదు చేసుకోవాలి

- కలెక్టర్ హరిచందన దాసరి

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

18 సంవత్సరాలు పూర్తయిన ప్రతి యువతి, యువకులందరు ఓటర్లుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఆదేశాల మేరకు ఈ నెల శని, ఆదివారాలలో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటర్ నమోదు క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శనివారం నల్గొండ పట్టణంలో పలు జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల ప్రత్యేక ఓటర్ నమోదు క్యాంపెయిన్‌ను జిల్లా కలెక్టర్ తనిఖీచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రం వారిగా అర్హులైన నూతన ఓటర్లను గుర్తించాలని, 18 సంవత్సలు నిండిన యువతి, యువకులతో పాటు దివ్యాంగులు మరియు ట్రాన్స్జెండర్ లను ఓటర్లుగా నమోదుచేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఓటర్లకు వారి వివరాలలో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించడం జరుగుతుందని, బిఎల్ఓలు ఇంటింటి సర్వే ద్వారా ఓటర్లను చైతన్యవంతులను చేయాలని, చనిపోయిన వారి వివరాలను జాబితా నుండి తొలంగించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రంలో బూత్ లెవెల్ అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రవి, తహశీల్దార్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



నర్సరీలలో మొక్కలు బాగా పెంచాలి

- అదనపు కలెక్టర్ చెక్క ప్రియాంక

నవతెలంగాణ-చింతలపాలెం

నర్సరీలలో మొక్కలు బాగా పెంచాలని అదనపు కలెక్టర్ చెక్క ప్రియాంక అన్నారు.శనివారం ఆమె మాట్లాడుతూ మండలంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న నర్సరీలు, పల్లెప్రకృతివనాలను పరిశీలించి మాట్లాడారు.మండలకేంద్రంతో పాటు పులిచింతల ప్రాజెక్టు కాలనీలలో నిర్వహించబడుతున్న నర్సరీలు, మెగా పల్లె ప్రకృతివనాలను సందర్శించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సురేందర్‌రెడ్డి, ఎంపీడీఓ జగదీష్‌కుమార్, మండల పరిషత్ అధ్యక్షులు వెంకటరెడ్డి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి క్విజ్‌లో కోదాడ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-కోదాడరూరల్

రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పోటీలలో కోదాడలోని తేజ విద్యాలయ విద్యార్థులు ప్రతిభ చాటారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రమా సోమిరెడ్డి శనివారం మాట్లాడుతూ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సారథ్యంలో గ్రే క్యాప్స్ క్విజ్ సంస్థ హైదరాబాద్ కింగ్ కోఠిలోని భారతీయ విద్యా భవన్ ఆడిటోరియంలో ఆస్పిరేషన్ క్విజ్ 2024 నిర్వహించారు. 5 నుండి 8వ తరగతి విద్యార్థులు క్విజ్ లకు అర్హులు. రాష్ట్ర స్థాయిలో (90) పాఠశాల నుంచి 180 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కోదాడ నుండి తేజ విద్యాలయ (8) వ తరగతి విద్యార్థులు దేవరపల్లి సునందు వర్ధన్ రెడ్డి , నోముల సృజన్ గుప్త జట్టు 425 పాయింట్లతో విజేతగా నిలిచారు.ఓబుల్‌రెడ్డి పాఠశాల 125 పాయింట్లతో ద్వితియ స్థానం సాధించారు.అస్సామీ క్విజ్ మాస్టర్ మహ్మద్ తారీఖ్ దీనిని నిర్వహించారు. హెచ్డిఎఫ్సి రీజినల్ బిజినెస్ అధినేత సిద్ధార్థ ఛటర్జీ విజేతలకు రూ.50వేలు బహుమతిచెక్కును,సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు.విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ రమా సోమిరెడ్డి అభినందించారు.

దేవరకొండను జిల్లాగా ప్రకటించాలని మంత్రికి వినతి

నవతెలంగాణ-దేవరకొండ

దేవరకొండ నుంచి జిల్లాగా ప్రకటించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేతావత్ లాలునాయక్ శనివారం సచివాలయంలో జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కి వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. దేవరకొండను జిల్లాగా ఏర్పాటు చేస్తే దేవరకొండ ఎంతో అభివృద్ధి చెందుతుందని,అలాగే జిల్లా స్థాయి అధికారులు ఇక్కడి ప్రజలకు అందుబాటులో ఉంటారని మంత్రితో పేర్కొన్నట్లు తెలిపారు. దేవరకొండలోని డిండి, కంబాలపల్లి,పెద్దగట్టు, లంబాపూర్, రేకులగడ్డ ప్రజలు జిల్లాస్తాయి అధికారులను ఏదైనా పని మీద కలవాలంటే 150 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తుందన్నారు.దేవరకొండ జిల్లాగా ఏర్పడితే మెడికల్ కాలేజీ కూడా అందుబాలులో ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో వనం చంద్రమౌళి, ముదిగొండ ఎల్లేష్, కామపల్లి కొండల్, బాణావత్ రవికుమార్, తదితులు పాల్గొన్నారు.

ఆరాధ్య ఫౌండేషన్ చైర్మెన్ తాడోజు వాణికి డాక్టరేట్



నవతెలంగాణ-తుంగతుర్తి

మలిదశ తెలంగాణ ఉద్యమకారిణి,సామాజిక సేవా కార్యక్రమంలో ముందుండే వ్యక్తి,కరోనా సమయంలో నిరుపేదలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేసిన సామాజిక సేవకురాలు,నియోజకవర్గంలో సమస్యలు ఎక్కడుంటే అక్కడ తమ సేవలందించిన సహృదయురాలు తాడోజు వాణి శ్రీకాంత్‌రాజ్.మహిళా సాధికారత కోసం నిరంతరం కృషి చేస్తూ,భావితరాల కోసం ఆరాటపడే మనస్తత్వం ఉన్న శ్రీ తాడోజువాణి శ్రీకాంత్ రాజ్ చేసిన అనేక ప్రజాసేవా కార్యక్రమాలను గుర్తించి శనివారం బేగంపేట మారి గోల్డ్ హోటల్‌లో న్యూమాంక్స్ కుంగ్‌ఫూ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కౌన్సిల్ జనరల్ ఆఫ్ టర్కియల్మాన్ 'ఓర్హాన్ ఓఖాన్" చేతుల మీదుగా "యునైటెడ్ థియోలాజికల్ రీసెర్చ్ యూనివర్శిటీ' వారు 'తెలంగాణ ఉద్యమకారులు ఆరాధ్య ఫౌండేషన్ చైర్మెన్ తాడోజు వాణి శ్రీకాంత్‌రాజ్‌కు' గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ అవార్డు రావడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. అలాగే సామాజిక సేవ చేయడంలో తన బాధ్యతను మరింత పెంచిందని తెలిపారు.ఆమెకు ఇంతటి గొప్ప పురస్కారాన్ని అందించడం పట్ల ఆరాధ్య ఫౌండేషన్ మండల అధ్యక్షులు అంబటి రాములు,తుంగతుర్తి నియోజకవర్గ నాయకులు గుగులోత్ జయపాల్ నాయక్,వాసం అభిలాష్, ప్రసన్నకుమార్‌తో పాటు పలువురు ప్రముఖులు ఆమెను అభినందించారు.



కుష్టి వ్యాధి నివారణా చర్యలు చేపట్టాలి

నవతెలంగాణ-చింతపల్లి

కుష్టువ్యాది నివారణాచర్యలు చేపట్టాలని ఎంఎల్ హెచ్‌పీ శోభ, ఏఎన్ఎం మార్తమ్మ అన్నారు. శనివారం చింతపల్లి మండలంలోని కురుమేడు గ్రామంలో కుష్టివ్యాధి నివారణ చర్యలో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు రాకుండా, పరిశుభ్రత పాటించాలని కురుమేడు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గ్రామంలోని ప్రజలంతా రోగాల బారిన పడకుండా వాతావరణ ప్రభావంతో శరీరంలో ఏ అనారోగ్య కారణంగా ఇబ్బంది పడుతున్నా డాక్టర్లను సంప్రదించాలని కోరారు.ఎవరైనా కుష్టువ్యాధిగ్రస్తులు ఉన్నట్లయితే డాక్టర్ల సలహాలు పాటించి మందులు వాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెల్లా నర్సింహాగౌడ్,సూపర్‌వైజర్ అమృత, ఏఎస్ఎం మార్తమ్మఆశావర్కర్లు గోరటి యాదమ్మ, కురుమేటి సైదమ్మ, గంజి లక్ష్మమ్మ కమలఉన్నారు.



ఎన్నికల స్పెషల్ క్యాంపియన్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ హేమంత్ కేశవ్‌పాటిల్

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పుల కోసం ఎన్నికల స్పెషల్ క్యాంపియన్ సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ హేమంత్ కేశవ్ పాటిల్ పేర్కొన్నారు.స్పెషల్ క్యాంపియన్ డే సందర్భంగా శనివారం అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ , మండల పరిధిలోని ఎల్లారెడ్డిగూడెం జీపీ పోలింగ్‌స్టేషన్ 165,166,167, నార్కట్‌పల్లి జీపీ పోలింగ్‌స్టేషన్ 144,145,146, 148 తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా బిఎల్‌ఓలకు సూచనలు చేశారు.స్పెషల్ క్యాంపియన్ రోజున మాన్యువల్‌గా వచ్చిన దరఖాస్తులను ఫామ్ 6,7,8 బిఎల్‌ఓ యాప్ ద్వారా ప్రాసెస్ చేయాలని సూచించారురు . ఇప్పటివరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయని బీఎల్‌ఓలను అడగడం, పోలింగ్‌స్టేషన్లో అన్ని వసతులు (టాయిలెట్స్) ఉన్నాయా లేవా? అని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వెంకయ్య తాసిల్దార్ పద్మ ఎంపీడీవో గుండాగొని యాదగిరిగౌడ్ ఎంపీ ఓ సత్యనారాయణ, రెవిన్యూ ఇన్స్పెక్టర్ తరుణ్ , పంచాయతీ కార్యదర్శి సుభానుద్దీన్, అంగన్వాడీ టీచర్‌లు పాల్గొన్నారు.



ఆడపిల్లలను రక్షిద్దాం.. చదవనిద్దాం

నవతెలంగాణ-మిర్యాలగూడ



ఆడపిల్లలను రక్షిద్దాం వారిని చదవనిద్దాం ఎదగనిచ్చి వారి భవిష్యత్తునిద్దాం అని ఐసీడీఎస్ సూపర్వైజర్ సీహెచ్ పద్మ అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సీతారాంపురం సెక్టర్‌లో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో ఆడపిల్లల అవసరం ఎంతైనా ఉందని వారిని రక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. పురుషులతో సమానంగా మహిళలు ఉండాల్సిన అవసరం ఉందని ఆడపిల్లలను రక్షించి వారికి చదివించి వారికి మంచి భవిష్యత్తు ఇవ్వాలని కోరారు. మహిళలు నేడు అన్ని రంగాలలో రాణిస్తున్నారని వారిని ప్రోత్సహించాలన్నారు. బేటి బచావో బేటి పడావో అనే నినాదంతో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా కార్యక్రమం చేస్తుందన్నారు. ఆడపిల్లల రక్షణ సమాజానికి అవసరమని, బాల్య వివాహాలను అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు విజయ, గౌసియా, మెరాజ్, నజుమా, శబన, షాహీన్, మీనాక్షి, రమాదేవి పాల్గొన్నారు.

బెల్ట్ షాపుల బంద్ పై కాంగ్రెస్ సర్పంచ్‌ల ఏకగ్రీవ తీర్మానం

నవతెలంగాణ-మర్రిగూడ

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని కాంగ్రెస్ సర్పంచులు తమ గ్రామాలలో బెల్టు షాపులకు నోటీసులు అందజేసి, పూర్తిస్థాయిలో బెల్ట్ షాపులను బంద్ చేపిస్తామని ఏకగ్రీవ తీర్మానం చేశారు.ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ ఎన్నికల ముందు తనని గెలిపిస్తే నియోజకవర్గంలో బెల్ట్‌షాపులను బంద్ చేపిస్తానని చెప్పిన ఎమ్మెల్యే గెలిచిన మొదటి నెలలోనే నియోజకవర్గంలో దాదాపు 2000 పైచిలుకు బెల్ట్‌షాపులను మూసివేయించారన్నారు.ఈ కార్యక్ర మంలో తమ్మడపల్లి సర్పంచ్ మాధవి రమేష్, అజ్జ లాపురం సర్పంచ్ అనసూయ అంజయ్య, రాజుపేట తండా సర్పంచ్ సక్కుబాయి బిచ్చు నాయక్, భీమనపల్లి సర్పంచ్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, కమ్మగూడ సర్పంచ్ నిర్మల లుర్ధయ్య, తిరుగండ్లపల్లి సర్పంచ్ అయితపాక జంగయ్య, లెంకలపల్లి సర్పంచ్ పాక నగేష్, సరంపేట సర్పంచ్ వెంకటమ్మ మధుకర్, కొట్టాల సర్పంచ్ కవిత యాదయ్య, ఇందుర్తి సర్పంచ్ జంగిల్ లక్ష్మీ ప్రసన్న రవి, మండల నాయకులు రాందాస్ శ్రీనివాస్, పాల్వాయి అనిల్‌రెడ్డి, కోడాల వెంకట్ రెడ్డి, జమ్ముల వెంకటేష్, నవీన్, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ(టిఎంఆర్ఐఇఎస్) ఆధ్వర్యములో నిర్వహించబడుచున్న గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల నందు 2024-25 విద్యా సంవత్సరమునకు గాను ప్రవేశాల కొరకు ఆన్ లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి టి. విజయేందర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.జనవరి 18 నుండి దరఖాస్తు తీసుకోవడం ప్రారంభించడం జరిగిందని పేర్కొన్నారు. నల్లగొండ జిల్లాను యూనిట్‌గా తీసుకోని ప్రవేశముల కొరకు పరీక్షా నిర్వహించి మెరిట్ జాబితా ప్రకారం ప్రవేశాలు కల్పించబడతాయని తెలిపారు. మైనారిటీ గురుకుల పాఠశాలల నందు 5 వ తరగతిలో కొత్త సీట్ల కోసం 6,7,8 వ తరగతులలో(కేవలము మైనారిటీ) ఖాళీగా ఉన్నసీట్లలో ప్రవేశముల కొరకు అదేవిధంగా నల్గొండజిల్లాలోని (బాలికలు, బాలురు) మైనారిటీ గురుకుల జూనియర్ కళాశాలల నందు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం యందు కొత్త సీట్ల కోసం కూడా దరఖాస్తు చేసుకునేందుకు ఫిబ్రవరి 6వ తేదీ వరకు గడువు ఉందని పేర్కొన్నారు. www.tmreistelangana.cgg.gov.in ద్వారా లేదా TMREIS మొబైల్ యఫ్ ద్వారా వచ్చిన దరఖాస్తులు స్వీకరించబడతాయనితెలిపారు. మరిన్ని వివరాలకు రీజినల్ లెవల్ కొ ఆర్డినేటర్ కార్యాలయం నందు సంప్రదించాలని పేర్కొన్నారు.

గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై సమావేశం

నవతెలంగాణ-పెన్‌పహాడ్

గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రానున్న ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ప్రణాళిక తయారు చేయుటకు అధికారులతో శనివారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జడ్పీ సీఈవో సురేష్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక మరియు బ్లాక్ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక సంబంధించి ప్రణా ళికలు తయారు చేయుట గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మందడి మహేందర్‌రెడ్డి, ఎంపిడిఓ బాణాల శ్రీనివాస్, ఎంపీఓ దొడ్డినరేష్, గ్రామపంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు

తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-పెన్‌పహాడ్

తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్(టిఆర్టిఎఫ్) నూతన సంవత్సర డైరీ,క్యాలెండర్ ను మండలంలోని అన్నారం గ్రామ జెడ్పి పాఠశాల ఆవరణలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దశరథ రామారావు, ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గులా జహంగీర్‌తో కలిసి ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి.అనిత, ఆర్.సత్యనారాయణ, రజియా, సుల్తాన్, ఎస్.కవిత, శ్రీనివాస్, శ్రీనివాస్, షబానా తదితరులు పాల్గొన్నారు.

